జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php



చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523



సంపుటి 5 సంచిక 115 | హైదరాబాద్, ఫిబ్రవరి 15 మంగళవారం 2022 | 8 పేజీలు | వెల : 5.00




# దేశ సమాఖ్య నిర్మాణాన్ని కాపాడేందుకు యత్నిస్తున్నాం

## కేసీఆర్ జాతీయ పార్టీ అడుగులు

హైదరాబాద్, ఫిబ్రవరి 14,:తెలంగాణ సీఎం కేసీఆర్ సంచలన ప్రకటన చేశారు. ప్రజలంతా అవసరమని కోరుకుంటే దేశంలో కొత్త పార్టీ పెడతామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. జాతీయ పార్టీ పెడుతారా అని ఓ జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు కేసీఆర్ ఇలా సమాధానమిచ్చారు. కొత్త పార్టీ ఎందుకు పెట్టకూడదు? పెడితే తప్పా? అని ప్రశ్నించారు. దేశంలో కొత్త పార్టీ పెట్టే దమ్ము తనకు లేదా అని నిలదీశారు. జాతీయ పార్టీ పెడితే తనను ఎవరు అడ్డుకుంటారన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు అనుకుంటే ఏమైనా జరగవచ్చున్నారు.తాను పుట్టగానే సీఎంను అవుతానని తన తల్లిదండ్రులు కలగన్నారా? ఒక పద్ధతి ప్రకారం పనిచేస్తుంటే.. అవకాశాలు అవే వస్తాయని కేసీఆర్ తెలిపారు. తాను తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని ఏర్పాటు చేసినప్పుడు కూడా అందరూ నవ్వారని కేసీఆర్ గుర్తుచేశారు. అప్పుడు నవ్విన వారు.. ఇప్పుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.ఉద్యమం చేస్తామని తాను ప్రకటించిన నాడు కూడా అందరూ నవ్వారన్నారు. కానీ ఇప్పుడు రాష్ట్రాన్ని ఏర్పాటు చేసి చూపించామన్నారు. ఇప్పుడు తాను జాతీయ పార్టీ పెట్టినా ఎవరూ అడ్డుకోరని కేసీఆర్ అభిప్రాయపడ్డారు.తెలంగాణలో విద్యుత్తు సంస్కరణలను అమలుపర్చడం లేదని రావాల్సిన నిధులను కూడా కేంద్రం ఆపేస్తుందని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. గ్రామీణ ఉపాధి పథకం వంటి పథకాల్లో రావాల్సిన నిధుల్లో కోత విధిస్తున్నారు. మోదీకి ఎనిమిదేళ్ల టైం ఇచ్చామని చెప్పారు. ఎనిమిదేళ్లు వేచి చూసినా ఆయనలో మార్పు రాలేదని, సంస్కరణల పేరిట ప్రజలను ఇబ్బంది పెట్టే ఆలోచనలో ఉన్నారని కేసీఆర్ మండి పడ్డారు. విద్యుత్తు శాఖను పూర్తిగా ప్రయివేటీకరించి ఆయన తాబేదార్లకు అప్పజెప్పాలని మోదీ చూస్తున్నారని ఆరోపించారు. బీజేపీకి విరాళాలిచ్చే వారికే విద్యుత్తును అప్పగించాలన్న కుట్ర జరుగుతుందన్నారు. 77 శాతం సంపద కేవలం పది మంది చేతుల్లోనే ఉందని ఆరోపించారు. అదే జరిగితే ప్రజలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. విద్యుత్తు ఛార్జీలు విపరీతంగా పెరుగుతాయని కేసీఆర్ చెప్పారు. తమకు విషయం అర్థమయ్యే మోదీ రంగు బయటపెట్టానని అన్నారు. డిస్కమ్‌లను ప్రయివేటుపరం చేయాలనుకోవడం (మిగతా 2లో..)

# ముచ్చింతల్ లో ముగిసిన సహస్రాబ్ది వేడుకలు



రంగారెడ్డి : ముచ్చింతల్‌లో ఈనెల 2వతేదీన ప్రారంభమైన సమతామూర్తి సహస్రాబ్ది వేడుకలు ముగిశాయి. నిన్న ఉదయం ముచ్చింతల్ యాగశాలలో మహాపూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. 12 రోజుల పాటు నిర్విఘ్నంగా లక్ష్మీనారాయణ మహాయాగం కొనసాగింది. చివరగా పారా గ్లైడర్లతో సమతామూర్తి విగ్రహంపై పుష్పాభిషేకం నిర్వహించారు. హోమాలు చేసిన రుత్వికులను చినజీయర్ స్వామి సన్మానించారు. 12 రోజుల పాటు వివిధ హోమాల్లో 5 వేల మంది రుత్వికులు పాల్గొన్నారు. ప్రతిరోజు అష్టాక్షరీ మంత్ర పఠనం, విష్ణుసహస్ర పారాయణం నిర్వహించారు. యజ్ఞంలోఓ భాగంగా విశ్వక్సేనేష్టి, నారసింహ ఇష్టి, లక్ష్మీనారాయణ ఇష్టి, పరమేష్టి, వైభవేష్టి, హయగ్రీవ ఇష్టి, వైయ్యూహిక ఇష్టి, సుదర్శన ఇష్టి, వైనతే ఇష్టి పూజలను చేశారు. ప్రతిరోజు 114 యాగశాలలో 1035 హోమకుండాల్లో 5 వేల మంది రుత్విజులు భక్తి శ్రద్ధలతో హోమం నిర్వహించారు. ఈ పన్నెండు రోజులు అష్టాక్షరీ మంత్ర పఠనం, చతుర్వేద పారాయణం, నిత్య పూర్ణాహుతి నిర్వహించారు. నిన్న రాత్రికి జరగాల్సిన శాంతి కల్యాణం వాయిదా పడింది. వచ్చే శనివారం 108 ఆలయాల్లో శాంతి కల్యాణం నిర్వహించనున్నారు.

# కాంగ్రెస్‌లో 'ఆ నలుగురు' కలకలం..

## టీఆర్ఎస్ పెద్దలతో టచ్‌లో ఉన్నారా?



హైదరాబాద్: ఆ నలుగురి నేతల తీరు కాంగ్రెస్ పార్టీలో కొత్త చర్చకు దారితీసింది. కాంగ్రెస్ పార్టీలో రేవంత్ రెడ్డి పొడగిట్టని నేతలు అంతా కేసీఆర్, టీఆర్ఎస్‌కు దగ్గరవుతున్నారా? లేదా ఆ నలుగురి నేతలను కేసీఆర్, కేటీఆర్ దగ్గరకు చేర్చుకుంటున్నారా? ఇదే కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు హాట్ టాఫిక్‌గా మారింది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఆశించి భంగపడ్డ పార్లమెంటు సభ్యులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ అయ్యాకా బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. ఢిల్లీ కాంగ్రెస్‌ను తాకే ఆర్థిక ఆరోపణలు చేసిన కోమటిరెడ్డి.. రేవంత్‌తో అంటిముట్టనట్లు ఉంటున్నారు. ఆతరువాత కేసీఆర్‌కు తద్వారా టీఆర్ఎస్‌కు దగ్గరయ్యే ప్రయత్నాలు చేశాడనేది ఆయన వ్యతిరేకుల విమర్శ. గతంలో యాదాద్రి పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసేందుకు ప్రయత్నించిన కోమటిరెడ్డి భంగపడ్డారనేది పార్టీ నేతల్లో గుసగుసలు వినిపించాయి. తాజాగా తన సొంత పార్లమెంట్ నియోజకవర్గమైన భువనగిరి పరిధిలోని జనగామలో పలు ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలలో పాల్గొనడానికి వచ్చిన కేసీఆర్‌తో కోమటిరెడ్డి ఆత్మీయంగా కలియ తిరిగారు. కేసీఆర్ కూడా కోమటిరెడ్డిని అక్కున చేర్చుకుని కౌగిలించుకున్నారు. మాటముచ్చట కలిపారు. అంతటితో ఆగకుండా అదే భువనగిరి నియోజకవర్గంలోని యాదాద్రిలో జరిగిన ప్రారంభోత్సవాలలో కూడా కోమటిరెడ్డి ఉత్సాహంగా పాల్గొని కేసీఆర్‌తో కలిసి పాల్గొన్నారు. ఆత్మీయ పలుకరింపులు, బోకేలు, కౌగిలింతలు చూస్తుంటే సగటు కాంగ్రెస్ కార్యకర్తలో అనుమాన బీజం పడడంతో తప్పులేదుగా? ఇప్పటికే వెంకటర్ రెడ్డి సోదరుడు కోమటిరెడ్డి రాజుగోపాల్ రెడ్డి కాంగ్రెస్‌తో డిటాచ్ అయ్యాడు. కమలం పట్టుకోవాలా?, గులాబీతో గుచ్చుకోవాలా? అన్న సందిగ్ధతతో ఉన్నారు. ఒకవైపు తమ్ముడు బీజేపీ వైపు చూస్తూనే, కాంగ్రెస్ కాడిని మోస్తున్నారు. ఇటు కోమటిరెడ్డి వెంకటర్ రెడ్డి మాత్రం కేసీఆర్‌తో చెట్టాపట్టాలేసుకుని తిరుగడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని కాంగ్రెస్ సీనియర్లు అంటున్నారు. ఇక, కాంగ్రెస్ శాసనసభ (మిగతా 2లో..)

## 3 రాష్ట్రాల్లో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

ఉత్తరప్రదేశ్ : మూడు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. యూపీ, ఉత్తరాఖండ్, గోవాలోని మొత్తం 165 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న 36,823 కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు మధ్య పోలింగ్ నిర్వహించారు. ఉత్తర్ ప్రదేశ్?లో రెండో దశ ఎన్నికల్లో 60.44 శాతం మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. గోవాలో 78.94శాతం, ఉత్తరాఖండ్?లో 62.5శాతం ఓట్లు పోలయ్యాయి. ఉత్తర్ ప్రదేశ్ లో 9 జిల్లాల పరిధిలోని 55 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 586 మంది బరిలో ఉన్నారు. 2017 ఎన్నికల్లో ఈ 55 సీట్లలో బీజేపీ 38 స్థానాలు గెలుచుకోగా.. సమాజ్‌వాదీ పార్టీ 15 స్థానాల్లో విజయం సాధించింది. గోవాలో 40 స్థానాలు, ఉత్తరాఖండ్?లో 13 జిల్లాలోని 70 అసెంబ్లీ సీట్లకు ఇవాళ ఎన్నిక జరిగింది.

# 25 నుంచి ప్రారంభం కానున్న నుమాయిష్




హైదరాబాద్: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్?లో ఈ నెల 25 నుంచి నుమాయిష్ ప్రారంభించినున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ప్రకటించింది. ఈ మేరకు ఏర్పాట్లు ప్రారంభించినట్లు చెప్పింది. జనవరి 1న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా 81వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన ప్రారంభమైంది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు మరుసటి రోజే అర్థాంతరంగా స్టాళ్లను మూసివేశారు. తాజాగా కొవిడ్ నిబంధనలు సడలించడంతో నుమాయిష్ నిర్వాహణపై ఎగ్జిబిషన్ సొసైటీ సమావేశం నిర్వహించింది. 25 నుంచి అధికారికంగా ప్రారంభించనున్నట్లు ప్రకటన విడుదల చేసింది. (మిగతా 2లో..)

# ఆదిలాబాద్ జిల్లాలో అనాగరిక చర్య



**12కుటుంబాలను వెలివేసిన కుల పెద్దలు**

ఆదిలాబాద్ :ఆదిలాబాద్ జిల్లాలో అనాగరిక చర్య. 12కుటుంబాలను వెలివేశారు కుల పెద్దలు.కులంలోకి రావాలంటే జరిమానా కట్టాలని హుకుం జారీ చేశారు. మూడేళ్లుగా శిక్ష అనుభవిస్తున్నారు బాధిత కుటుంబాలు.శుభకార్యాలకు, చావులకు వెళ్లకూడదని ఆదేశాలు జారీ చేశారు. చేపల వేట విషయంలో చిన్న వివాదమే దీనికి కారణమని స్థానికులు తెలిపారు. సంఘం భవనం కోసం డబ్బులు ఇవ్వలేదని, 12కుటుంబాలను దూరంగా ఉంచామని పెద్దలు తెలిపారు. ఖోడద్ చేపల చెరువు విషయంలో వివాదం తలెత్తిందని మత్సకారుల సంఘం నేతలు వెల్లడించారు. కాగా తాజాగా మూడేళ్ల నాటి నిర్ణయం వెలుగులోకి వచ్చింది.

# సర్జికల్ స్ట్రైక్స్‌పై వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం..

## సీఎం కేసీఆర్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఫైర్!



హైదరాబాద్ : తెలంగాణలో అధికార టీఆర్ఎస్ విపక్ష బీజేఎల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. గులాబీ దళపతి కేంద్రం సర్కార్ లక్ష్యంగా సమరశంఖం పూరించారు.టీఆర్ఎస్ యుద్ధం చేస్తామంటే మేం రెడీ అంటున్నారు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి. సర్జికల్ స్ట్రైక్స్‌పై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి. భారత సాయుధ బలగాలపై తెలంగాణ సీఎం కేసీఆర్ చేసిన బాధ్యతారహిత ప్రకటనను తీవ్రంగా ఖండించారు కిషన్ రెడ్డి. ప్రధాని నరేంద్రమోడీని లేదా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కు. కానీ మన దేశభక్తి సాయుధ దళాలను అవమానించడం దురదృష్టకరమన్నారు.భారత సాయుధ బలగాలపై తెలంగాణ సీఎం చేసిన బాధ్యతారహిత ప్రకటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.


PAY BACK TO SOCIETY
SNEHA CLUB

స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob
Dr. N. Venkateswarlu Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046
7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

# దోపిడీ వ్యవస్థ నిర్మూలన కోసమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం

**తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు భాగం శరయ్య సంతాప సభలో వామపక్ష నేతలు**



బోనకల్, ఫిబ్రవరి 14 ప్రజాపాలన ప్రతినిధి:దోపిడీ వ్యవస్థ నిర్మూలన కోసమే వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సాగిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంత్ రావు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని గోవిందపురం (ఏ) గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, అమరజీవి భాగం శారయ్య సంస్మరణసభ సిపిఐ, సిపిఎం మండల కార్యదర్శులు యంగల ఆనంద్ రావు, దొండపాటి నాగేశ్వరరావుల అధ్యక్షతన సోమవారం జరిగింది. సంస్మరణ సభలో వారు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దళాలకు శరయ్య సమాచారం, భోజనాలు అందించేవాడు అన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో అనేక మంది తమ అసువులు అర్పించారని, వారి త్యాగాల స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సమస్యల పరిష్కారం కోసం పోరాటం లోకి రావాలని కోరారు. నైజాం సైన్యం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తొమ్మిదిమందిని నిర్బంధించి గోవిందా పురం (ఎల్) గ్రామము తీసుకువచ్చి ఏడుగురుని కాల్చి చంపారని, మిగిలిన ఇద్దరిలో గోవిందపురం( ఎల్) చెందిన కొత్తపల్లి కృష్ణమూర్తి తప్పించుకోగా, చిన్నవాడు అనే కారణం తో భాగం శారయ్య నువిడుదల చేసారని వారు తెలిపారు. ఈ పోరాటంలో పేద ప్రజలకు పది లక్షల ఎకరాలు పంచి పెట్టారని, సుమారు ఐదు వేల మందికి పైగా తమ ప్రాణాలు అర్పించారని అన్నారు. శారయ్య లాంటి పోరాట యోధుల ఆశయాల సాధన కోసం మనం కృషి చేయడమే వారికి ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. బిజెపి ప్రభుత్వం లౌకిక రాజ్యాన్ని మత రాజ్యాంగం గా మార్చాలని ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. పేద కుటుంబాలు ఆదాయాలు పడిపోయి మరింత నిరుపేదలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆర్థిక రేటు ఏమి పెరగలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ పాలనలో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్ పాలన తెలంగాణ రాష్ట్ర ప్రజల అభిరుచులకు అనుగుణంగా లేదని, కుటుంబ పాలన, నియంత పాలన సాగుతుందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీలు పడుతూ పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నియంత పాలన, సమాజ మార్పు కోసం ముందుకు యువత రావాలని వారు పిలుపునిచ్చారు. ఆనాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పోరాట యోధులు పెన్షన్ల కోసం పోరాటం చేయలేదని ప్రజల కోసం పోరాటాలు చేశారన్నారు. నేడు స్వార్థం, సంపాదన కోసం రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సభకు ముందు భాగం శరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సంతాప సభ లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు,తూము రోషన్ కుమార్ , గోవిందపురం (ఏ) సర్పంచ్ భాగం శ్రీనివాసరావు, ఆళ్ళపడు సర్పంచ్ మర్రి తిరుపతి రావు,నల్లమల్ల నిర్మల శరయ్య కుటుంబ సభ్యులు కళ్యాణం వీరభద్రరావు, వేమరవెంట్ల నాగేశ్వరరావు సిపిఎం నాయకులు షేక్ ఖాసిం, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు భాగం రమేష్, మోటమర్రి సొసైటీ ఉపాధ్యక్షుడు, కావూరి శంకర్రావు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## "భారత రాజ్యాంగ రక్షణకై రౌండ్ టేబుల్ సమావేశం"



ఆసిఫాబాద్ ఫిబ్రవరి 14 (ప్రజాపాలన, ప్రతినిధి) : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన ప్రాంగణంలో ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్, దళిత బహుజన సంఘాల రాజకీయ పార్టీ నాయకులతో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు మాదిగ మాట్లాడుతూ భారత రాజ్యాంగ రక్షణ కై కుల మతాలకతీతంగా కలిసికట్టుగా ఉద్యమించి బి ఆర్ అంబేద్కర్ ఎంతో శ్రమించి 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు కష్టపడుతూ కుటుంబం ఎన్ని కష్టాలు ఆదుతున్నా పట్టించుకోకుండా భారత దేశ ప్రజల కోసం, ప్రజల విముక్తి కోసం, భారత రాజ్యాంగాన్ని రాసి, దేశ ప్రజలకు బాట వేసిన గొప్ప మహనీయుడని అన్నారు. అలాంటి రాజ్యాంగాన్ని మార్చాలని, అవసరమైతే రాజ్యాంగాన్ని ముందుండి నేనే తగలబెట్టాలని, దురహంకారంతో మాట్లాడిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పై ధ్వజ మెత్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ, వర్గాల ప్రజలు ప్రాణాలకు తెగించైనా రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, జాతీయ ఉపాధ్యక్షుడు రూప్నసర్ రమేష్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ గణేష్ రాథోడ్, సిపిఐ నాయకులు బద్రి సత్యనారాయణ,శివ రామ్ నాయక్,కోట వెంకన్న, రేగుంట మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ లావాదేవీల ద్వారా సురక్షితమైన బ్యాంకింగ్

**జిల్లా కలెక్టర్ భారతి హోళ్ళికేరి**



మంచిర్యాల బ్యూరో, ఫిబ్రవరి 14, ప్రజాపాలన :డిజిటల్ లావాదేవీలతో సురక్షితమైన భద్రతతో కూడిన బ్యాంకింగ్ నిర్వహిం చవచ్చని జిల్లా కలెక్టర్ భారతి హోళ్ళికేరి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్నాయక్, ట్రైనీ కలెక్టర్ ప్రతిభా సింగ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ హవేలిరాజుతో కలిసి ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు ప్రతి సంవత్సరం నిర్వహించడం జరుగుతుందని, గో డిజిటల్ - గో సెక్యూర్ అనే నినాదంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంకుల సమన్వయంతో నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో అన్ని ప్రభుత్వ శాఖలు, స్వయం సహాయక బృందాలు, సిబ్బంది ద్వారా ప్రతి ఒక్కరికి డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పిస్తూ ఓ.టి.పి., పాస్వర్డ్ మొదలైన వాటి గోప్యత వివరాలు ఇతరులకు చెప్పకుండా చైతన్యం తీసుకురావాలని తెలిపారు. జిల్లాలోని అన్ని బ్యాంకులలో ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఖాజా నజీమ్ అలీ అప్సర్, షెడ్యూల్డ్ కులాల శాఖ అధికారి దుర్గప్రసాద్, వయోజన విద్యాధికారి పురుషోత్తమ్నాయక్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహిళల పట్ల తన ఔదార్యాన్ని చాటుకుంటున్న దివ్య రెడ్డి ఫౌండేషన్

**1000 మంది మహిళలకు సానిటరీ ప్యాడ్స్ ను అందజేసిన దివ్యారెడ్డి**



మేడిపల్లి, ఫిబ్రవరి 14 (ప్రజాపాలన ప్రతినిధి ) : నేడు ఆధునిక సమాజంలో మహిళలు ఎన్నో రకాలుగా అణచివేతకు గురవుతూ, వారి వాస్తవ పరిస్థితులను చెప్పుకోలేని దుస్థితిలో మగ్గిపోతున్న నేటి సమాజంలో తాను అండగా ఉంటానంటూ ముందుకొచ్చి, స్త్రీ ప్రకృతి సిద్ధంగా ఎదురుకునే సమస్యలు రుతుక్రమం అంటే కౌమారదశలో ఉన్న స్త్రీ జీవితంలో కొత్త దశ. ఇంకా చాలా మంది బాలికలు ఋతుస్రావం సమయంలో కళంకం మరియు సామాజిక బహిష్కరణను ఎదురుకుంటారు. ఇదిసహజంగా దేవుడి సృష్టి, ఇందులో స్త్రీ ప్రమేయం లేదు, ఇలాంటి సమస్యలతో మహిళలు వేధింపులకు గురవుతారు. దురదృష్టవశాత్తూ నేటికీ చాలా మంది స్త్రీలు దురదృష్టవశాత్తూ వస్త్రం, కాటన్ రోల్స్ మొదలైన వాటిని ఉపయోగించే ప్రాచీన పద్ధతులను ఉపయోగిస్తున్నారు, ఇవి అపరిశుభ్రంగా ఉండటమే కాకుండా దీర్ఘకాలంలో చాలా అసౌకర్యంగా మరియు ప్రమాదకరంగా ఉంటాయి."అనేక ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు లేకపోవడం మరియు సహ-విద్యా పాఠశాలల్లో వేధింపులకు గురైన బాలికలు 7వ తరగతి తర్వాత పాఠశాల నుండి తప్పుకోవడం నేను వ్యక్తిగతంగా చూశాను. రుతుక్రమ పరిశుభ్రతపై బాలికలకు అవగాహన కల్పించడం మాత్రమే కాదు, చిన్న పిల్లలతో దానిని సాధారణీకరించడం మరియు ఈ నిషేధాన్ని అధిగమించడానికి వెనుకబడిన కుటుంబాలకు అవగాహన కల్పించడం కూడా ముఖ్యమని దివ్యారెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు దివ్యారెడ్డి పేర్కొన్నారు. హబ్సిగూడలోని ఉస్మానియా యూనివర్శిటీలోని క్యాంపు 3,4,5లో 1000 మందికి శానిటరీ ప్యాడ్ల ప్యాకెట్లను పారిశ్రామికవేత్త రీతూ షాతో కలిసి దివ్యరెడ్డి పంపిణీ చేశారు. స్థానిక మహిళలతో మాట్లాడి రుతుక్రమ పరిశుభ్రతపై వారికి అవగాహన కల్పించారు. "శానిటరీ పరిశుభ్రతను ఉపయోగించడం ఈ అడ్డంకులను అధిగమించడంలో సహాయపడుతుందని, గౌరవం, పరిశుభ్రత, బిల్డ్ కాన్ను కూడా అందిస్తారు. అత్యంత వెనుకబడ్డ ప్రాంతాలలో ఎన్నో రకాలుగా సహాయ సహకారాలు అందిస్తూ మహిళల్లో చైతన్యాన్ని కల్పిస్తూ, వారిని ముందుకు దివ్యరెడ్డి ఫౌండేషన్ నడిపిస్తుందని దివ్య రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు దివ్య రెడ్డి తెలిపారు.

## యూరియా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మితే షాపుల పై కఠిన చర్యలు తీసుకుంటాం

**వ్యవసాయ అధికారి..**





పాలేరు పిబ్రవరి 14 ప్రజాపాలన ప్రతినిధి : నేలకొండపల్లి, మండల పరిధిలోని పీఏసీఎస్ లలో తగినంత యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి ఎస్వీకే నారాయణరావు అన్నారు. యూరియా కొరత లేదని, కావాల్సినంత నిల్వలు ప్రస్తుతమున్నాయని తెలిపారు సోమవారం మండల కేంద్రంలోని పలు ఎరువులు దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఎమ్మార్పీ ధరలకే యూరియా విక్రయించాలని దుకాణ నిర్వాహకులకు సూచించారు ఎవరైనా అధిక ధరలకు అయినట్టుంటే వారిపై తగిన చర్యలు తీసుకుంటాం సొసైటీల నిర్వాహకులు కూడా అవసరాన్ని బట్టి మార్క్ ఫెడ్ నుంచి యూరియా తెప్పించుకోవాలని ఆయన సూచించారు.

## వాసవీక్లబ్స్ ఆధ్వర్యంలో అమరవీరులకు శ్రద్ధాంజలి



మంచిర్యాల బ్యూరో, పిబ్రవరి 14, ప్రజాపాలన : పుల్వామా దాడిలో భారత సైనిక వాహన శ్రేణిపై పాకిస్తాన్ కు చెందిన ఉగ్రవాదులు చేసిన దాడి జరిగి సంవత్సరం గడిచిన సందర్భంగా మంచిర్యాల వాసవీక్లబ్స్ ఆధ్వర్యంలో అమర జవానులకు శ్రద్ధాంజలి ఘటించారు. సోమవారం రాత్రి మంచిర్యాల ఐబీ చౌరస్తాలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కాండిల్ లతో అమర వీరుల జవానుల ఆత్మశాంతికి క్యాడిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీక్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షులు కటకం హరీష్ మాట్లాడుతూ, దేశం కోసం స్థాణాలను అర్పించిన అమరులను స్మరించుకుంటు దేశంలో వేళ్ళూనుకున్న పాశ్చాత్య సంస్కృతిని తరిమి కొట్టాలని ఇందులో భాగంగా ఫిబ్రవరి 14న నిర్వహించుకునే వాలంటైన్స్ డేను నిషేధించాలని పిలుపునిచ్చారు. అలాగే అంతర్జాతీయ అధ్యక్షుని పిలుపు మేరకు సోమవారం వాసవీక్లబ్ సభ్యులు మాతృవందనంలో భాగంగా తల్లిదండ్రులకు పాదాభివందనం చేశారు. అలాగే ఈ నెల 16నుండి మేడారంలో జరుగనున్న సమ్మక్క సారలమ్మ జాతరకు మంచిర్యాల ఆర్టీసి డిపో నుండి వెళ్ళడానికి ఇతర డిపోల నుండి వచ్చిన డ్రైవర్లు, కండక్టర్లకు భోజన వసతి వాసవీక్లబ్స్ కల్పించారు. ఈ భోజన వసతి కార్యక్రమాన్ని గుండ శ్రీలత, శ్రీధర్, కాచం నిఖిల్ దాతలుగా వ్యవహరించి డ్రైవర్ల కండక్టర్లకు భోజనం అందజేశారు. ఈ కార్యక్రమాలలో వాసవీక్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షులు కటకం హరీష్, క్యాబినెట్ కోశాధికారి పుల్లూరి బాలమోహన్, రీజియన్ చైర్మన్ వుత్తూరి రమేష్, జోన్ చైర్మన్లు కాచం సతీష్, నాగిశెట్టి జ్యోతి, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ అక్కేనపల్లి రవీందర్, వాసవీక్లబ్ అధ్యక్షుడు కేశెట్టి వంశీకృష్ణ, కార్యదర్శి నలుమాసు ప్రవీణ్, కోశాధికారి మల్యాల శ్రీనివాస్, పనితాక్లబ్ అధ్యక్షురాలు గౌరిశెట్టి ధనలక్ష్మి, కోశాధికారి కటుకం సునీత, కపుల్స్ క్లబ్ అధ్యక్షుడు గడ్డం రమాదేవి రమేష్ కోశాధికారి బజ్జూరి శ్రీవాణి, శ్రీనివాస్, యూత్ క్లబ్ అధ్యక్షుడు మల్యాల యోగేశ్వర్, కోశాధికారి బోనగిరి సాయి, సభ్యులు ఈగం సంతోష్ , గుండా లహరి తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం పార్టీ నుండి ముగ్గురు ఎంపీటీసీల బహిష్కరణ

**:సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**



బోనకల్, ఫిబ్రవరి 14 ప్రజాపాలన ప్రతినిధి : డిసెంబర్ 30న జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగి పోయి రాష్ట్ర పార్టీ ఆదేశాలను ధిక్కరించి, ప్రలోభాలకు లొంగి పోయిన వారు పార్టీ, ప్రజలు ఇచ్చిన పదవులను స్వార్థ ప్రయోజనాలకు వాడుకోవాలి అనుకునే వారికి సిపిఎం పార్టీలో స్థానం ఉండదని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. కమ్యూనిస్టు నిస్వార్థంగా ప్రజాసేవ చేయడంతోపాటు రాజకీయ నిబద్ధత తో ఆదర్శంగా ఉండాలని తెలియజేశారు.బోనకల్ మండల పరిధిలోని సిపిఎం పార్టీ ఎంపీటీసీలు గా గెలుపొందిన రావినూతల ఎంపీటీసీ కందిమల్ల రాధ, రామాపురం ఎంపీటీసీ ముక్కపాటి అప్పారావు, పెద్ద బీరవల్లి ఎంపీటీసీ కర్లకుంట దేవమణి లను బహిష్కరించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ముగ్గరితో పాటు తూటికుంట్ల ఎంపీటీసీ, ఎంపీపీ కంకణాల సౌభాగ్యం కూడా ఓటు వేయగా ఆమెను బహిష్కరించకపోవటంతో. ఈ ముగ్గురిని సస్పెండ్ చేయడంపై మండలంలో చర్చాంశనియం అయినది.

## నాణ్యమైన విద్యను ప్రోత్సహించేందుకే మన ఊరు - మన బడి



మంచిర్యాల బ్యూరో, ఫిబ్రవరి 14,ప్రజాపాలన :ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను ప్రోత్సహించేందుకే మన ఊరు - మన బడి కార్యక్రమం చెపట్టిన ట్లు జిల్లా కలెక్టర్ భారతి హొళికేరి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ట్రైనీ కలెక్టర్ ప్రతిభాసింగ్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నరేందర్, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లుతో కలిసి రోడ్లు-భవనాలు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి పారుదల, నీటిపారుదల, ప్రజా ఆరోగ్యం, గిరిజన సంక్షేమ, పురపాలక శాఖల ఇంజనీరింగ్ విభాగాల ఈ.ఈ., డి.ఈ. లతో మన ఊరు - మన బడి, మన బస్తీ - మన బడి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలల్లో త్రాగునీరు, ఫర్నీచర్, గ్రీన్ చాక్ బోర్డులు, నీటి సౌకర్యంతో పాటు శౌచాలయాలు, విద్యుత్ సరఫరా, సిబ్బందికి, విద్యార్థులకు అవసరమైన ఫర్నీచర్, అన్ని పాఠశాలల భవనాలకు ఒకే విధమైన పెయింటింగ్తో పాటు పాఠశాలలోని గోడలపై విద్యార్థులను ఆకట్టుకునేలా బొమ్మలు, ప్రహారి గోడలు, పంటశాలలకు షెడ్ల నిర్మాణం, శిథిలమైన తరగతి గదుల స్థానంలో నూతనంగా తరగత గదుల నిర్మాణం చేయడం జరుగుతుందని అన్నారు. ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాల్ నిర్మాణం, డిజిటల్ విద్యా విధానం, పూర్తి స్థాయిలో పాఠశాలల మరమ్మత్తులు చేపట్టి అన్ని హంగులతో అభివృద్ధి చేసి ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాల నిర్వహణ కోసం ప్రత్యేకమైన యాప్ తయారు చేయడం జరుగుతుందని, ఈ యాప్ ద్వారా పనులు, ప్రతిపాదనలు ఇతరత్రా జరుగుతాయని తెలిపారు. గిరిజన గ్రామాలు, షెడ్యూల్డ్ కులాల సంబంధిత ప్రాంతాలలో 10 శాతం నుండి 15 శాతం ప్రభుత్వం ముందుస్తుగా నిధులు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి విరాళాలు ఇచ్చే దాతలను గుర్తించి, విరాళాలను సేకరించి పాఠశాలల అభివృద్ధి పనులకు వినియోగించాలని సూచించారు. ఎవరైనా దాత 10 లక్షల రూపాయలు ఒక పాఠశాలకు విరాళం ఇవ్వడానికి ముందుకు వచ్చినచో ఒక తరగతి గదికి వారు సూచించిన వ్యక్తి పేరు పెట్టడం జరుగుతుందని, 25 లక్షల రూపాయలు విరాళం ఇచ్చినట్లయితే ఆ దాత సూచించిన వ్యక్తి యొక్క పేరు పాఠశాల యొక్క ఒక బ్లాక్కు పెట్టడం జరుగుతుందని, ఒక కోటి రూపాయలు లేదా ఒక పాఠశాలలో అన్ని మౌలిక వసతుల కల్పనకు ఎంత అయితే ఖర్చు అవుతుందో పూర్తి ఖర్చును విరాళంగా ఇచ్చే వ్యక్తి యొక్క పేరుతో ఆ పాఠశాల యొక్క పేరు మార్చడం జరుగుతుందని తెలిపారు. నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని, ఈ పనులన్నిం టి ఖర్చులపై సోషల్ ఆడిట్ ఉంటుందని తెలిపారు. మరమ్మత్తు, నిర్మాణ పనులకు సిమెంట్, ఇసుక రైతువేదికలు, రెండు పడక గదుల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించిన ధరకే అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా విద్యార్థులు స్పోర్ట్స్ పాఠశాలలో అడ్మిషన్లు సాధించాలి

మంచిర్యాల బ్యారో , ఫిబ్రవరి 12, ప్రజాపాలన :తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ - హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ నందు 4, 5 తరగతులలో అడ్మిషన్ కొరకు ఈ నెల 24వ తేదీన జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్న ఎంపిక పోటీలలో జిల్లా విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచి అడ్మిషన్లు సాధించాలని జిల్లా కలెక్టర్ భారతి హొళికేరి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ట్రైనీ కలెక్టర్ ప్రతిభా సింగ్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్రెడ్డితో కలిసి ఎంపిక పోటీల సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత గల అభ్యర్థులు ఈ నెల 24వ తేదీన ఉదయం 8 గం॥ల వరకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం నందు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారికి సంబంధిత ధృవపత్రాలతో రిపోర్టు చేయాలని, ఆసక్తి, అర్హత గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా

మంచిర్యాల బ్యూరో, ఫిబ్రవరి 14, ప్రజాపాలన :సీసీ కెమెరాలతో నిరంతరం నిఘాతో సమ్మక్క-సారలమ్మ జాతర కి పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు మంచిర్యాల ఏసీపీ ఎస్. రష్మీ పేరమాళ్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో సమ్మక్క, సారలమ్మా జాతర కొరకు ఏర్పాటు చేసిన బందోబస్త్ ఏర్పాట్ల పరిశీలించి సిబ్బందికి , ప్రజలకు తగు సూచనలు జారీ చేశారు. .ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... గోదావరి నది ఒడ్డున గల సమ్మక్క,

**మంచిర్యాల ఏ సి పి ఎస్ రష్మీ పేరమాళ్ ఐపిఎస్**



సారలమ్మ జాతర దృష్ట్యా భక్తులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా జాతర సందర్భంగా . (5)సీఐ లు, (11) ఎస్ ఐ లు..,( 40)ఏఎస్ ఐ /హెడ్ కాన్స్టేబుల్ లు , (105)కాన్స్టేబుల్ లు , (29)మహిళ సిబ్బంది, (46) హొం గార్డ్స్ , స్పెషల్ పార్టీ సిబ్బంది మొత్తం 236 తో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగింది అని తెలిపారు.

**భక్తులు పోలీస్ సూచనలు పాటించాలి**

జాతరకు వచ్చే భక్తులు సంతోషంగా గడపాలని ఇందుకు పోలీసుల సూచనలు పాటించాలని తెలిపారు. బక్తులు స్వీయ రక్షణ పాటించాలని , పరిసరాలను శుభ్రంగా ఉంచాలి అని, కరోనా వైరస్ దృష్టిలో ఉంచుకుని తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం డయల్100కు లేదా పట్టణ ఇన్స్పెక్టర్ నారాయణ 9440795042 మంచిర్యాల ఏసీపీ 9400795040లకు ఫోన్ చేయాలని తెలిపారు . కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ ఇన్స్పెక్టర్ నారాయణ, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్, ఎస్సైలు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక స్థాయి నుండి సైన్స్ అవగాహన

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



ఆసిఫాబాద్ జిల్లా, ఫిబ్రవరి 14 , ప్రజాపాలన, ప్రతినిధి : ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థినీ, విద్యార్థులకు, భౌతిక రసాయన శాస్త్రం నియమాల పై పూర్తి అవగాహన లభించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఈనెల 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్లో అదనపు కలెక్టర్ వరుణ్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ లతో కలిసి భౌతిక రసాయన శాస్త్రం ఉపాధ్యాయులకు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థినీ, విద్యార్థులకు, సైన్స్ నియమాలను నేర్పించడంలో ప్రయోగలు,కృత్యాలు,ప్రముఖ పాత్రను పోషిస్తామని, పాఠశాల స్థాయిలో పొందిన విజ్ఞానము వారి ఉన్నత చదువులలో మరింత అభివృద్ధి చెందేందుకు ఉపయోగపడుతుందని, ఉపాధ్యాయులు విద్యార్థులసృజనాత్మను వెలికి తీసే విధంగాప్రయత్నించాలని తెలిపారు. ఈ నెల 22న పాఠశాలల స్థాయిలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించాలని, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని పాఠశాలలోపాల్గొనేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



**హైదరాబాద్ స్నేహ టివి కార్యాలయంలో స్నేహ మాస్టర్ కీ టివి గెస్ట్ కో-ఆర్డినేటర్ సోమపంగు వేంకటేశ్వర్లు జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో స్నేహ గ్రూప్ ఎండీ కటికల క్రాంతికుమార్, హెచ్‌ఆర్ పద్మాశర్మ, డైరెక్టర్ ఫైనాన్స్ సుబ్బారావు, ఇన్‌పుట్ ఎడిటర్ దుర్గాప్రసాద్, అకౌంట్స్ మేనేజర్ రామారావు, స్నేహ సిబ్బంది తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.**

## పురపాలక పరిధిలో పన్నులను పూర్తి స్థాయిలో వసూలు చేయాలి

**జిల్లా కలెక్టర్ భారతి హొళ్ళికేరి**



మంచిర్యాల బ్యూరో, ఫిబ్రవరి 14, ప్రజాపాలన:పురపాలక పరిధిలో ఆస్తి పన్నులు, నీటి పన్నులు, ట్రేడ్ ఇతరత్రా అన్ని రకాల పన్నులను సకాలంలో వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ భారతి హొళికేరి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్నాయక్, ట్రైనీ కలెక్టర్ ప్రతిభాసింగ్, మంచిర్యాల శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్రావు, మున్సిపల్ చైర్పర్సన్ పెంట రాజయ్య, మున్సిపల్ కమీషనర్ బాలకృష్ణతో కలిసి 2022-23 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పురపాలక సంఘం అభివృద్ధి పనులకు సంబంధించిన బడ్జెట్ను ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందని తెలిపారు. సుమారు 6 వేల 026 లక్షల రూపాయల ఆదాయ అంచనాతో ప్రవేశపెట్టిన బడ్జెట్లో సుమారు 1వేయి 703 లక్షల రూపాయల పన్ను ఆదాయం ద్వారా, 1 వేయి 919 లక్షల రూపాయల ఆదాయం పన్నేతర ఆదాయం ద్వారా సమకూర్చుకోవాలని బడ్జెట్లో పొందుపర్చడం జరిగిందని, మిగిలిన 2 వేల 371 లక్షల రూపాయలు కేంద్ర, రాష్ట్ర గ్రాంట్ల ద్వారా సేకరించుకోవాలని నిర్ణయించటం జరిగిందని తెలిపారు. వ్యయం విషయానికి వస్తే అత్యధికంగా ఖర్చుల వ్యయం క్రింద 2 వేల 522 లక్షల రూపాయలు కేటాయించగా ఇందులో కార్మికుల వేతనానికి 1 వేయి 023 లక్షల రూపాయలు, పారిశుధ్య నిర్వహణకు 382 లక్షల రూపాయలు, కరెంట్ చార్జీలకు 569 లక్షల రూపాయలు, గ్రీన్ బడ్జెట్కి 460 లక్షల రూపాయలు కేటాయించటం జరిగిందని తెలిపారు. బడ్జెట్లో ప్రజా సౌకర్యాల కల్పనకు, వార్డుల వారిగా అభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందని, త్వరలో మంచిర్యాల పట్టణం అమృత్ పథకానికి అర్హత పొందుతుందని ఆశిస్తూ 5 కోట్ల రూపాయలను అమృత్ పథకం క్రింద వస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. మొత్తంగా 6 వేల 026 లక్షల రూపాయలు ఆదాయంగా 6 వేల 026 లక్షల రూపాయలను వ్యయంగా చూపిస్తూ సంతులిత బడ్జెట్ను ప్రవేశ పెట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్, వార్డుల కౌన్సిలర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇటిక్యాల పోడు రైతుల సమస్యలు పరిష్కరించాలి



ఆసిఫాబాద్ జిల్లా ఫిబ్రవరి 14 (ప్రజాపాలన, ప్రతినిధి) : జిల్లాలోని సిర్పూర్ టీ మండలం ఇటిక్యాల పహాడ్ గ్రామ పోడు రైతులు తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సోమవారం నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం పోడు సాగు చేసుకుంటున్న రైతులకు తీరని అన్యాయం చేస్తోందని, ఎన్నో ఏళ్లుగా అడవిని కొట్టుకొని భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటూ ఉన్నారు. ఇప్పుడు ప్రభుత్వాలు ఫారెస్ట్ అధికారులు పోడు సాగు చేసుకుంటున్న రైతులని వెళ్లగొట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. వ్యవసాయం పై ఆధారపడి బతుకుతున్న వారిపై ప్రభుత్వం ఫారెస్ట్ అధికారులతో దాడులు చేయించి భూములను లాక్కోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నారు. వెంటనే ఇటిక్యాల పహాడ్ పోడు రైతుల భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈరోజు నిరవధిక నిరాహార దీక్షలో కూర్చున్న వారు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గం దినకర్, మొహర్ల భీమ్రావు, నాగేష్, ప్రకాష్, పలుకుతున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అల్లూరి లోకేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్, నైతం రాజు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో 'ఆ నలుగురు' కలకలం..

(మొదటి పేజీ తరువాయి)

పక్షనేత భట్టి విక్రమార్కకు పీసీసీ రేవంత్ రెడ్డికి మధ్య కూడా అంత సయోధ్యలేదు. ఒకదశలో పీసీసీ ఆశించిన భట్టి.. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడకున్నా, రేవంత్ రెడ్డి వ్యవహార శైలిపై బహిరంగ విమర్శలు చేయకున్నప్పటికీ, లోలోపల మాత్రం రేవంత్ నాయకత్వాన్ని జీర్ణించుకోలేకపోతున్నట్లు ఆయన సన్నిహితులే చెబుతున్నారు. అంతేకాకుండా కేసీఆర్, కేటీఆర్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని అంటుంటారు. ఆచనువుతోనే దళితబంధుపై సమీక్ష జరిపిన నేపథ్యంలో భట్టిని పిలువడం.. ఆయన వెళ్లడం, కాంగ్రెస్ పార్టీ నుంచి విమర్శలు సైతం ఎదుర్కోవల్సి వచ్చింది. ఈ క్రమంలోనే భట్టి సొంత నియోజకవర్గంలో ఓ మండలాన్ని కూడా దళితబంధు కోసం సెలెక్ట్ చేశారు ముఖ్యమంత్రి కేసీఆర్. ఇవన్నీ చూస్తే ప్రగతిభవన్‌క భట్టికి పెద్ద దూర భారం లేదనే గుసగుసలు రేవంత్ వర్గం ప్రచారం చేస్తోంది. మరో కీలక నేత, మాజీ మంత్రి మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు. ఆయన కూడా పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అయినప్పటి నుంచి అంటిముట్టనట్లు ఉంటున్నారు. కాకపోతే కమిట్‌మెంట్ ఉన్న కాంగ్రెస్ నేతగా మంచి పేరు ఉంది. మాజీ అసెంబ్లీ స్పీకర్ అయిన తండ్రి శ్రీపాదరావు నుంచి మొదలుకుని ఇప్పటి వరకు పార్టీలైన్ తప్పిందిలేదు. వివాదరహితుడుగా, కేవలం నిర్మాణాత్మక విమర్శలకు మాత్రమే పరిమితం అయ్యే శ్రీధర్‌బాబను సహజంగానే అందరూ గౌరవిస్తారు. మంత్రి కేటీఆర్ %--% శ్రీధర్‌బాబు రాజకీయ సమకాలికులు కాకపోయినప్పటికీ, కేటీఆర్‌తో సన్నిహిత సంబంధాలు కొనసాగుతున్నారు. నిర్మాణాత్మక ఆరోపణలు, విమర్శలు తప్ప కేసీఆర్, ఆయన కుటుంబంపై ఏనాడు శ్రీధర్‌బాబు నోరుపారేసుకోలేదు. శ్రీధర్‌బాబు సతీమణి శైలజాఅయ్యర్ ఐఎఎస్ అధికారి కావడం, ఆమె కీలకమైన పోస్టలలోనే ఉండడంతో శ్రీధర్‌బాబు కూడా కేసీఆర్‌కు సన్నిహితం అన్నట్లుగానే కొంతమంది పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నట్లు శ్రీధర్‌బాబు సన్నిహిత వర్గం చెప్పే వాదన.రేవంత్ రెడ్డి అంటే ఇష్టం ఉన్నా లేకపోయినప్పటికీ పార్టీలైన్‌లోనే శ్రీధర్‌బాబు వెళుతున్నారు. అయితే, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్టా మధు టీఆర్‌ఎస్‌కు దూరం అవుతున్నట్లు సంకేతాలు, శ్రీధర్‌బాబు కేసీఆర్, కేటీఆర్‌కు సన్నిహితమనే సంకేతాలు కాంగ్రెస్‌లో కలవరం సృష్టిస్తున్నాయి. ఇటీవల ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ కొడుకు పెళ్లిలో కేటీఆర్, శ్రీధర్‌బాబు అన్యోన్యంగా కలిసిపోయారు. శ్రీదర్‌బాబు వద్దకు కేటీఆర్ వచ్చి మరీ పలుకరించిన ఫోటోలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అయ్యాయి. శ్రీధర్‌బాబు మాత్రం ఈ ప్రచారాన్ని కొట్టిపారేశారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు సమీపంలోకి వచ్చి పలుకరించినపుడు ఆత్మీయంగా మాట్లాడడం మర్యాదగా ఉంటుందన్నారు. ఈక్రమంలోనే పెళ్లిలో కేటీఆర్‌తో ముచ్చటించినట్లు చెబుతున్నారు. పదవులకోసం, అధికారం కోసం దిగజారే స్వభావం తనది కాదని, తనకు తెలిసినవాళ్లకు తాను అంటే ఏమిటో తెలుసని శ్రీధర్‌బాబు ప్రచారాన్ని కొట్టిపారేశారు.ఇక, మరో కీలక నేత సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి. జగ్గారెడ్డికి రేవంత్ రెడ్డి అంటే ఒక్క క్షణం పడదు. ఆయన అంటే అసలు గిట్టదు. ఇంటా బయట రేవంత్‌పై పదునైన విమర్శలు చేస్తున్నారు. తొలినుంచి టీఆర్‌ఎస్ కోవర్ట్‌గా జగ్గారెడ్డిని రేవంత్ వర్గం చిత్రీకరించడం.. ఆయనకు ఏమాత్రం నచ్చదు. అందుకే రేవంత్ రెడ్డిపై బహిరంగంగా విరుచుకుపడుతుంటారు. ఆమధ్య సంగారెడ్డిలో ప్రారంభోత్సవాలు కేటీఆర్ వచ్చిన సందర్భంగా జగ్గారెడ్డి కలివిడి తిరిగారు. కేసీఆర్‌పై ఆయన కుటుంబంపై విమర్శలు ఘాటు కూడా తగ్గించారు. దీంతో వచ్చే ఎన్నికల్లో సంగారెడ్డి టీఆర్‌ఎస్ అభ్యర్థి జగ్గారెడ్డి అంటూ ప్రచారం కూడా జరుగుతోంది. అయితే, జగ్గారెడ్డి ఇవేమి పట్టించుకోకుండా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తన పని తాను చేసుకుంటూ పోతూనే రేవంత్ వర్గాన్ని ఒక కంటకనిపెడుతున్నారు. రేవంత్ వర్గం సామాజిక మాధ్యమాల్లో తనపై గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని జగ్గారెడ్డి రేవంత్ వర్గంపై దుమ్మెత్తిపోస్తున్నారు. ఈ నలుగురు నేతలు కేసీఆర్, కేటీఆర్‌కు దగ్గర కాకున్నా, ఈనలుగురిని కేసీఆర్, కేటీఆర్ దగ్గరకు చేర్చుకోవడానికి జరుగుతున్న ప్రయత్నం భవిష్యత్తు రాజకీయాలను ఆవిష్కరిస్తోంది. ఇటీవల సీఎం కేసీఆర్.. ప్రధాని నరేంద్ర మోడీని, బీజేపీని టార్గెట్ చేయడం, రాహుల్ గాంధీకి అనుకూలంగా వ్యాఖ్యానించడంతో తెలంగాణ రాజకీయాల రంగులు మారుతున్నట్లే కనిపిస్తోంది.

## డ్రైవర్ కూతురు పెళ్లికి ఆర్థిక సహాయం అందజేసిన సినీనటుడు ఆలీ



హైదరాబాద్(ప్రజాపాలన ప్రతినిధి) :తెలుగు మోషన్ పిక్చర్స్ టీవీ వెబ్ సిరీస్ డిజిటల్ డ్రైవర్స్ యూనియన్ సభ్యుని కుమార్తె వివాహానికి నటుడు ఆలీ 10 వేల ఆర్థిక సహాయం అందించాడు. సోమవారం అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వల్లభనేని అనిల్, భాషల సమక్షంలో ఆలీ చెక్కును అందజేశారు. తమ యూనియన్ లో ఉన్న డ్రైవర్ల సంక్షేమానికి ప్రత్యేకంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు అనిల్ తెలిపారు. ముఖ్యంగా వివాహ సమయంలో యూనియన్ తరపున 2116 లు అందించడంతో పాటు నటీనటులు ఎవరైనా ఆసక్తిగా ఉంటే వారి ద్వారా మరింత ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. హాస్యనటుడు ఆలీ ఇప్పటికే చాలామందికి ఇలా సహాయం అందించాలని తెలిపారు. ముందు ముందు కూడా సహాయం కొనసాగుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.

## 25 నుంచి ప్రారంభం కానున్న నుమాయిష్

(మొదటి పేజీ తరువాయి)

45 రోజుల పాటు కొనసాగనున్న ఈ ఎగ్జిబిషన్?లో సోమవారం నుంచి శుక్రవారం వరకు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10.30 వరకు, శని, ఆదివారాల్లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11గంటల వరకు స్టాళ్లు తెరిచి ఉంటాయని సొసైటీ సెక్రటరీ ఆదిత్య మార్గం స్పష్టంచేశారు. ఈ ఏడాది ఎగ్జిబిషన్ గ్రౌండ్స్?లో 2000 స్టాళ్లతో నుమాయిష్ ఏర్పాటు చేశారు. కొవిడ్ కారణంగా ఎగ్జిబిషన్ మూతపడటంతో దాదాపు 30శాతం మంది వ్యాపారులు డబ్బు వెనక్కి తీసుకొని వెళ్లిపోయారు. మిలిగిన 70శాతం మంది నుమాయిష్ ఎప్పుడు ప్రారంభిస్తే అప్పుడు వ్యాపారాలు నిర్వహిస్తామని అడ్వాన్స్ వెనక్కి తీసుకోలేదు. ఎగ్జిబిషన్ తిరిగి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ స్టాళ్ల నిర్వాహకులందరికీ సొసైటీ ఫోన్ కాల్స్, మెసేజ్?ల ద్వారా సమాచారం.

## దేశ సమాఖ్య నిర్మాణాన్ని కాపాడేందుకు యత్నిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

దారుణమని కేసీఆర్ చెప్పారు. సంస్కరణల్లో భాగంగా సబ్సిడీలను ఎత్తివేయాలని కండిషన్లు పెట్టారన్నారు. పేదప్రజలు ఏమై పోతారని కేసీఆర్ ప్రశ్నించారు. జలవిద్యుత్తు ను ఆపేసి సౌర విద్యుత్తునే కొనుగోలు చేయాలని షరతు పెడుతుందన్నారు. 40 వేల కోట్ల మంది దళితులకు బడ్జెట్ లో 12 వేల కోట్లు కేటాయించింది నిజం కాదా? అని ప్రశ్నించారు. కిషనర్ రెడ్డి తనకు బడ్జెట్ పై అవగాహన లేదన్నారని, ఈసారి అలా మాట్లాడితే బాగుండదని హెచ్చరించారు. ఎనిమిదేళ్లలో ఏ రంగం? ఏరంగంలో అభివృద్ధి సాధించారో చెప్పాలని కేసీఆర్ మోదీని నిలదీశారు. ఎన్ఎస్ఈ చెప్పిన లెక్కల ప్రకారం ఉపాధి, పారిశ్రామిక రంగంలో ఏం సాధించావో తెలిసిపోతుందని చెప్పారు. ఆయన అభివద్ధి అంతా వాట్సాప్ యూనివర్సిటీలోనే కన్పిస్తుందని కేసీఆర్ ఎద్దేవా చేశారు. నిజంగా 12 శాతం వృద్ధి ఉందా అని ప్రశ్నించారు. అదే జరిగితే దేశం ఎప్పుడో అభివృద్ధి చెందేదన్నారు. బీజేపీ పాలనలో దేశం సర్వనాశనమయిందన్నారు. అన్ని రంగాలను అమ్మేసేటందుకే మోదీ వచ్చారన్నారు. క్షుద్ర సోషల్ విరీడియాలో ట్రోలింగ్ చేస్తున్నారన్నారు. ఈ దేశం నుంచి బీజేపీ వెళ్లిపోవాలని కేసీఆర్ మరోసారి డిమాండ్ చేశారు. అందిస్తోంది.


మాస్టర్ కీ TV
(అంబేడ్కర్ TV)

జై భీం,
మీరు నాయకుడిగా ఎదగాలని అనుకుంటున్నారా...?
మీరనుకున్న వార్తలు రావాలని కోరుకుంటున్నారా...?
పెట్టుబడి లేకుండా ఆదాయం పొందాలని అనుకుంటున్నారా...?
మీరూ మీ అసెంబ్లీ నియోజకవర్గం లో
టీవీ ఛానల్ ఓనర్ గా కావాలని అనుకుంటున్నారా...?
అయితే రండి, కదలి రండీ

బహుజనాభివృద్దే.. దేశాభివృద్ధి అని నిరూపిద్దాం

1. ఈ దేశంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ (మీడియా రంగం) బహుజనుల సమస్యల మీద ప్రచారం చేయడం లేదని మీ అందరికీ తెలుసు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా విలేఖరులకు సామాజిక కార్యకర్తలకు, అంబేడ్కర్, పూలే సంఘం నాయకులకు, కనీసం 100 మంది తెలిసిన గ్రూపునాయకులకు టీవీ ఛానల్ ప్రతినిధిగా / యజమానిగా అవకాశం ఇవ్వబడును.
2. జీవిత కాలంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతినిధిగా / యజమానిగా నియమించబడును.
3. ఆయా ప్రతినిధికి ప్రకటనల ఆదాయం (Advertising Revenue)లో ప్రకటనలపై 40% ఆదాయం ఇవ్వబడును.
4. వార్తలను స్వేచ్ఛాయతంగా ప్రసారం (Telecast) చేసే వీలు కల్పించబడును.

సంప్రదించండి

Tel No: 9849031420 ,9440918143, 94409 18371, 94400 53858, 93473 50692,8008840506, 9440077239, 7798832998, 76600 27678,
Office: Ambedkar TV Channel, 3rd Floor, Dault Plaza, Main Road, Besides Bata Showroom, Lakdi ka pool, Hyderabad - 500004
E- mail : ambedkartvchannel2018@gmail.com www.ambedkartv.org

ప్రజాపాలన

సంపాదకీయం

మంగళవారం 15, ఫిబ్రవరి 2022

## సోదరుడు దోస్తోవ్‌స్కీ

"అమ్మా, నా బంగారం! నిజానికి మనం అంతా అందరికీ బాధ్యులమే. కానీ ఈ సత్యం మానవాళి గుర్తించటం లేదు. గుర్తించిననాడు భూమి స్వర్గంగా మారిపోతుంది." (కరమజోవ్ సోదరులు)తెలుగు సాహిత్యం వరకూ గతేడాది చివర్లో ఒక అద్భుతం సంభవించింది. అది రష్యన్ మహానవల 'బ్రదర్స్ కరమజోవ్'కు తెలుగు అనువాదం రావడం! ఆ నవల సృష్టికర్త, ఈ పదాన్ని దాని అక్షరమక్షరంతో నిజం చేసిన ఫ్యోదర్ దోస్తోవ్‌స్కీ (1821-1881) ద్విశతాబ్ది జయంతి కూడా గతేడాదే(నవంబర్ 11) కావడం మరో విశేషం. ఆ సందర్భాన్ని ఉత్సవం చేయడం కోసమే 'రష్యన్ సాహిత్యాభిమాన వేదిక' ఈ బృహత్ కార్యానికి పూనిక వహించింది. తొమ్మిది వందల పేజీల ఈ నవలను 'సాహితి' ప్రచురించింది. దీని అనువాదకురాలు అరుణా ప్రసాద్ ఒక జీవితకాలానికి సరిపడా ప్రేమకు అర్హురాలు! ఇంత ఊరించిన తర్వాత దీన్ని చదవడానికి పాఠకుడు ఆతృత పడితే దెబ్బతినొచ్చు. మొత్తంగా పుస్తకంలో ఏం ఉందో('పితృహత్య') మొదటే తెలిసిపోతుంది. కాబట్టి, ఆ క్షణంలో ఏం మాట్లాడుకుంటున్నారో అదే ముఖ్యం. రంగస్థలంపై పాత్రలు వచ్చి, అంతరంగాన్ని 'ఏకపాత్రాభినయం'లా ఎలా ఆవిష్కరించుకుంటాయో ఇవీ అలాగే చేసినట్టుగా తోస్తుంది. కానీ ఆలోచిస్తే అంత అవాస్తవం ఏమీ అనిపించదు. ఒక ఉద్వేగంలోకి వెళ్లిన మనిషి ఎలా వదరుతాడో ఇక్కడా అంతే! అయితే సంభాషణల్లో జీవితపు మౌలిక ప్రశ్నల్ని ఎలా వెతుక్కుంటారన్నది ముఖ్యం. ఎన్ని చిత్తవృత్తులు, ఎన్ని వృత్తాంతాలు, ఎన్ని ఒప్పుకోళ్లు, ఎన్ని వేడుకోళ్లు! ఇందులో ప్రతి ఒక్కరూ 'పాపం' చేసినట్టే ఉంటారు. దానికి తగిన 'శిక్ష' అనుభవిస్తూనే ఉంటారు. అల్పులు, ఉన్మత్తులు, మొరటు మనుషులు, ఏ పెద్దరికమూ నిలుపుకోలేని హాస్యగాళ్లు... అసలు 'నీచుడు' అనుకునేవాడిలోనూ అత్యంత సున్నితపు పొరలు ఉంటాయని తెలుస్తున్నప్పుడు ఆనంద బాష్పాలు కారుతాయి. తను చచ్చేంత డబ్బు అవసరంలో ఉన్నా, ఆ డబ్బు కోసం అవసరమైతే తండ్రినే చంపేంత కోపంగా ఉన్నా, అదే డబ్బు అడిగితే తనకు కాత్యా ఇస్తుందని తెలిసినా, ఆమెను కాదని గృషెంకాను ప్రేమిస్తున్నప్పుడు, కాత్యాను ఆ డబ్బు అడగలేకపోయానని ద్మిత్రీ విచారణలో చెప్పడం మానవాంతరంగపు లోతుకు అద్దం. ఇంతే లోతైన మరో ఘట్టం 'ఎల్డర్' జోసిమా దగ్గర తన తప్పును ఒప్పుకున్న 'రహస్య అతిథి'... ఆయన ముందు నైతికంగా తగ్గిపోయానని భావించి తిరిగి ఆయననే చంపాలనుకోవడం! మన మూలమూలలా ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ, రచయిత ఎంత సూక్ష్మాంశాల దగ్గరికి వెళ్తాడంటే ఇంత సున్నితమైన నవల మరొకటి ఉందా అనిపిస్తుంది. ఒకే అమ్మాయి (గృషెంకా) కోసం తండ్రీ కొడుకులు ఫ్యోద్ర్, ద్మిత్రీ పోటీ పడటంబీ ఒకే అమ్మాయి(కాత్యా) కోసం అన్నాదమ్ములు ద్మిత్రీ, ఇవాన్ బరిలో ఉన్నట్టనిపించడం... జీవితపు చేదు వాస్తవం. ఇందులో ముగ్గురు సోదరులైన ద్మిత్రీ ఒక మృగంలానూ, ఇవాన్ మేధావిలానూ, అల్యోషా ఆధ్యాత్మిక జీవిగానూ కనబడతారు. అయితే దోస్తోవ్‌స్కీకి మృగాల పట్ల తక్కువ అభిప్రాయం లేదు. 'మృగాలెప్పుడూ, ఎన్నటికీ మానవుడంత క్రూరంగా ఉండజాలవు'. బహు గొంతులు, సూక్ష్మంలోనూ సూక్ష్మం దోస్తోవ్‌స్కీని అనితర సాధ్యమైన రచయితగా నిలబెడతాయి. ప్రతి పాత్రలోనూ రచయిత ఎంతగా పరకాయ ప్రవేశం చేస్తాడంటే, అదింక ఇంకోలా మాట్లాడే వీలున్నట్టు కనబడదు. చిన్న పాత్రలైన గ్రిగొరీ, మేడమ్ హొెలకోవ్, లిజి, కొల్యాకు కూడా ఇది వర్తిస్తుంది. ఆఖరికి, తుంటరి పిల్లాడు ఇల్యూష గుండుసూదిని గుచ్చిన రొట్టెను విసరడంతో తిని చనిపోయిన కుక్క జుట్చ్‌కా కూడా ఒక 'వ్యక్తి'గా దర్శనమిస్తుంది. అదే మథనంతో మరణానికి చేరువైన ఇల్యూషా కూడా అంతే నొప్పి పుట్టిస్తాడు. జీవితాన్ని చివరికంటా శోధించి, అందులోని సర్వ వికారాల్నీ తడుముతూ కూడా అది ప్రేమకు అర్హమైనదే అని చాటడం దోస్తోవ్‌స్కీ లక్ష్యం! అందుకే దేవుడి సృష్టిలోని సకల దుర్మార్గాలనూ పరిపరి విధాలుగా ఇవాన్ ఎత్తి చూపినప్పుడు కూడా దానికి స్పందనగా తనను నిర్బంధించిన మహా ధర్మాధికారి పెదవులను క్రీస్తు ముద్దాడిన కథనాన్ని పునర్జీవిస్తూ అల్యోషా, అన్న పెదవుల మీద ముద్దు పెట్టుకుంటాడు. ఆధ్యాత్మిక రాజ్యస్థాపన ద్వారానే నిజమైన సోదర భావం నెలకొంటుందని దోస్తోవ్‌స్కీ విశ్వాసం. అరెస్టయ్యి, గంటలకొద్దీ సాగిన విచారణ తర్వాత, అలసటతో నిద్రపోయినప్పుడు... తనకు తలగడ పెట్టే దయ చూపినవారెవరని ద్మిత్రీ కదిలిపోతాడు. అదెవరో రచయిత చెప్పడు. కానీ ఎంతటి నిరాశలోనైనా ఒక దయగల చేయి ఎప్పటికీ ఉంటుందని చాటుతాడు. 'అటువంటి ఒక్క జ్ఞాపకం ఉన్నా అది కూడా మనను కాపాడటానికి ఉపయోగపడుతుంది' అని ముగింపులో వీడ్కోలు చెబుతూ పిల్లలకు అల్యోషా చెప్పేది ఇందుకే. అసలు హంతకుడు ఎవరో బయటపడేప్పటికి ఈ నవల కాస్తా సస్పెన్స్ థ్రిల్లర్ రూపు తీసుకుంటుంది. కానీ దీని విస్తృతి రీత్యా ఆ వర్గానికి పరిమితం చేయడం దీన్ని సరైన అంచనా కట్టకపోవడమే అవుతుంది. ఇది సమస్త మానవాళి పశ్చాత్తాపాల చరిత్ర! జీవన మధువును నింపుకోవడానికి ప్రతి ఒక్కరూ పడే తహతహ. పాపభీతితో కుమిలిపోయే ఎందరో జీవన్మృతుల వ్యథ. 1880లో ఈ నవల వచ్చిన 4 నెలలకు దోస్తోవ్‌స్కీ మరణించాడు (ఈ ఫిబ్రవరి 9న 140వ వర్ధంతి.) ఆ లెక్కన ఇది ఒక మహారచయిత చివరి వీలునామా కూడా! 'అద్భుతాలను' ఆశిస్తాడు మనిషి. కానీ అద్భుతం వల్ల కాక మామూలుతనం వల్ల దాని విలువ పెరగాలి. ఈ పుస్తకం ఎంత మామూలుదంటే, ఆ మామూలుతనమే అద్భుతంగా తోస్తుంది.

# పంజాబ్‌లో ఆప్... ఉత్తరాఖండ్‌లో బీజేపీ?

ఐదు రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికల పోరు రసవత్తరంగా సాగుతోంది. పంజాబ్(ఫిబ్రవరి 20), ఉత్తరాఖండ్(నేడు)లలో ఒకే విడతలో జరగనున్న ఓటింగ్‌లో పార్టీల అంతర్గత కుమ్ములాటలు, నేతృత్వ సమస్యలు ఓటర్లను ప్రభావితం చేయనున్నాయి. మూడు కొత్త వ్యవసాయ చట్టాల రద్దు కోసం సాగిన రైతుల ఉద్యమం ఎటూ కీలకపాత్ర పోషించనుంది. పంజాబ్‌లో ఈసారి కాంగ్రెస్, బీజేపీలను ఆమ్ ఆద్మీ పార్టీ వెనక్కినెట్టే అవకాశాలు ఉన్నాయి. కానీ సొంతంగా మెజారిటీ వస్తుందని చెప్పలేం. ఇక ఉత్తరాఖండ్‌లో బీజేపీ గెలిచే అవకాశం కనబడుతున్నా, ఆమ్ ఆద్మీ ఇక్కడా కింగ్ మేకర్ పాత్ర పోషించే వీలుంది. భారతదేశ రాజకీయాల్లో పంజాబ్, ఉత్తరా ఖండ్ కొంత ప్రత్యేకం. సామాజిక వర్గాల ఆధిపత్యం పార్టీల తీరుతెన్నులపైనా ప్రభావం చూపే ప్రాంతాల్లో ఈ రెండు రాష్ట్రాలు ఉంటాయి. చరిత్రను తరచిచూస్తే పంజాబ్ జనాభాలో 58 శాతం ఉన్న సిక్కులు రాజకీయంగానూ బలవంతు లన్న విషయం స్పష్టం. ఉత్తరాఖండ్ విషయానికి వస్తే... అరవై శాత మున్న అగ్రవర్ణాలదే ఆధిపత్యం. ఈ రెండు రాష్ట్రాల ముఖ్య మంత్రులు కూడా ఈ వర్గాల వారే. ఉత్తరాఖండ్‌లో నేడు, పంజాబ్‌లో ఫిబ్రవరి 20న జరిగే ఎన్నికల్లోనూ ఇదే పంథా కొనసాగే అవకాశాలు మెండు. భారత రాజకీయాల్లో కుల, మతాధిపత్యాల ఆధారంగా వివక్ష చాలాకాలంగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. సమీప భవి ష్యత్తులో అంతమవుతుందని కూడా ఆశించలేము. పంజాబ్, ఉత్తరా ఖండ్ రెండింటిలోనూ పార్టీలు అంతర్గత కుమ్ములాటలు, నేతృత్వ సమస్యలతో కొట్టుమిట్టాడాయి. ఈ పరిణామాలతో ముఖ్యమంత్రు లనూ మార్చాల్సి వచ్చింది. కాంగ్రెస్ పంజాబ్‌లో ఒకసారి ముఖ్య మంత్రిని మారిస్తే, ఉత్తరాఖండ్‌లో బీజేపీ రెండుసార్లు ఈ పని చేయాల్సి వచ్చింది. ఢిల్లీలో ఏడాదికిపైగా సాగిన రైతు ఉద్యమం (పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్ రైతులు ఎక్కువగా పాల్గొన్నారు) కారణంగా నూతన వ్యవసాయ చట్టాల రద్దు జరిగింది. ఇప్పుడు ఈ అంశం ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల అంశంగానూ మారింది. ఈ ఉద్యమం సందర్భంగా రాజధానిలో జరిగిన ఘటనలు కొన్ని పంజాబ్‌లో దళితులందరూ (32 శాతం జనాభా) ఒకవైపునకు కేంద్రీకృతమయ్యేందుకు దోహదపడింది.

**ముఖాముఖి నుంచి బహుముఖానికి...**

పంజాబ్‌లో చాలావరకూ ముఖాముఖి పోటీలే జరిగేవి. శిరోమణి అకాలీదళ్‌బీజేపీల కూటమి ఒకవైపు, కాంగ్రెస్ ఇంకోవైపు నిలబడగా సాగిన పోటీలకు 2017లో ఆమ్ ఆద్మీ పార్టీ రంగ ప్రవేశంతో తెరపడినట్లు అయ్యింది. పోటీ త్రిముఖమైంది. రావి, బియాస్ నదుల మధ్యలో ఉండే మాఝా ప్రాంతంలో గురుద్వారాలు, డేరాలు రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తుంటాయి. దోబా విషయానికి వస్తే ఇది ఎన్ఆర్ఐలు ఎక్కువగా ఉండే ప్రాంతం. బియాస్, సట్లెజ్ నదుల మధ్యలో ఉంటుంది. ఈ ప్రాంత జనాభాలో దళితులు (37 శాతం), చిన్న, సన్నకారు రైతులు ఎక్కువ.

సట్లెజ్‌కు ఆవల ఉండే మాల్వా ప్రాంతం జమీందార్లు, పెద్ద రైతులు ఎక్కువగా ఉండే ప్రాంతం. 2017లో కాంగ్రెస్ మొత్తం 117 అసెంబ్లీ స్థానాల్లో 77 గెలుచుకుని విజయం సాధించగా... వచ్చిన ఓట్లు దాదావు 39 శాతం. మాల్వా ప్రాంతంలోని 69 స్థానాల్లో కాంగ్రెస్ 40 చేజిక్కించుకుంది. అలాగే మాఝాలోని 25 స్థానాల్లో 22, దోబా ప్రాంతంలోని 23 స్థానాల్లో 15 గెలుచుకుని అధికారం చేపట్టింది. ఆ ఎన్నికల్లో 20 స్థానాలతో ఆమ్ ఆద్మీ పార్టీ రెండో స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. ఆసక్తి కరంగా ఈ పార్టీ మాల్వా ప్రాంతంలో 18, దోబాలో 2 స్థానాలు గెలు చుకోవడమే కాకుండా... మొత్తమ్మీద 23 శాతం ఓట్లు సాధించ గలిగింది. అప్పట్లో అధికార పక్షం శిరోమణిబీజేపీ కూటమికి 31 శాతం ఓట్లు దక్కినా... సాధించిన సీట్లు మాత్రం 18 మాత్రమే. ఇప్పుడు పోటీ త్రిముఖ స్థాయి నుంచి బహుముఖానికి మార డంతో రాష్ట్రంలో ఓ పెద్ద రాజకీయ మార్పునకు రంగం సిద్ధమవు తోంది. ఈ ఎన్నికల్లో చర్చకు వస్తున్న అంశాలు కొత్త సీసాలో పాత సారా చందంగానే ఉన్నాయి. మాదకద్రవ్యాలు, ఇసుక, మద్యం, కేబుల్ మాఫియా సమస్య, నిరుద్యోగం, రైతు సంక్షోభం, అవినీతి, పెరిగిపోతున్న ప్రభుత్వ రుణాల వంటివి ప్రధానాంశాలుగా మారాయి. ఇటీవలి కాలంలో ప్రాధాన్యం సంతరించుకుంటున్న మరో అంశం గురుద్వారాలో మతగ్రంథాలకు జరిగిన అవమానం. నాయ కత్వ స్థాయిలో కుమ్ములాటల వంటి సమస్యలతో కాంగ్రెస్ పార్టీ నిన్నమొన్నటివరకూ చెల్లాచెదురుగా ఉన్నా... పంజాబ్ తొలి దళిత ముఖ్యమంత్రిగా చరణ్‌జీత్ సింగ్ చన్నీ ప్రకటనతో ఈ కుమ్ములాటకు కొంతవరకూ తెరపడింది. కానీ పాలనపరమైన వైఫల్యాలు, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం, చన్నీ, సిద్ధూలతో కులాలు, మతాల ఆధారంగా రాజకీయ సమీకరణలు చేయడం వంటి అంశాలు ఆ పార్టీ అవకాశాలకు గండికొట్టే ప్రమాదముంది. రాష్ట్రంలో దళితులు 32 శాతం వరకూ ఉండగా... జాట్లు 20 శాతం వరకూ ఉన్న విషయం ఇక్కడ ప్రస్తావనార్హం. దళితుడిని ముఖ్యమంత్రిగా చేయడం ద్వారా రాజకీయంగా ఒక మెట్టు పైనున్నా ఇది జాట్ల వ్యతిరేకతకు దారితీసే ప్రమాదం కాంగ్రెస్ వెన్నంటే ఉంది. మరోవైపు ఆమ్ ఆద్మీ పార్టీ తమ సీఎం అభ్యర్థి భగవంత్ సింగ్ మాన్ ద్వారా కాంగ్రెస్‌ను నేరుగా ఢీకొంటోంది. మాన్, కేజ్రీవాల్‌లు ప్రకటించిన పది అంశాల అభివృద్ధి ప్రణాళిక మాల్వా ప్రాంతంలో తన బలాన్ని పెంచుకునేందుకు, ఇతర ప్రాంతాల్లో లాభాలు తెచ్చి పెట్టేందుకు ఉపయోగపడుతుందని అంచనా. బీజేపీ మాజీ కాంగ్రెస్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ ఏర్పాటు చేసిన కొత్త పార్టీ పంజాబ్ లోక్ కాంగ్రెస్ (పీఎల్‌సీ)తో కలసి ఈసారి బరిలోకి దిగు తోంది. శిరోమణి నుంచి వేరుపడ్డ వర్గపు పార్టీ శిరోమణి (సంయుక్త) కూడా కాషాయ పార్టీ కూటమిలో భాగంగా ఉంది. బీజేపీ ఈ సారి 65 స్థానాల్లో పోటీ చేస్తూండగా పీఎల్‌సీ 38 స్థానాల్లో, శిరోమణి (సంయుక్త) 14 స్థానాల్లో పోటీ పడుతున్నాయి. హిందూ, సిక్కు ఓటర్లను తమవైపునకు తిప్పుకునేందుకు ఈ కూటమి ప్రయత్ని స్తోంది. కేంద్రం ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీ, బోర్డర్ సెక్యూరిటీ అంశాల ఆధారంగా మాఝా ప్రాంతంలో పట్టు సాధించే దిశగా అడుగు లేస్తోంది. సుఖ్‌బీర్ సింగ్ బాదల్ నేతృత్వంలోని శిరోమణి ఎన్డీయే నుంచి వేరుపడ్డ తరువాత ఈసారి ఎన్నికల కోసం బీఎస్పీతో జట్టు కట్టింది. రైతు ఉద్యమంలో భాగమైన 22 యూనియన్లతో ఏర్పాటైన సంయుక్త సమాజ్ మోర్చా బి.ఎస్.రాజేవాలా నేతృత్వంలో తొలిసారి ఎన్నికల బరిలోకి దిగింది. ఎన్నికలకు ముందు నిర్వహించిన ఒపీనియన్ పోల్స్ ప్రకారం పంజాబ్‌లో ఈ సారి ఆమ్ ఆద్మీ పార్టీ గెలిచే అవకా శాలు ఉన్నాయి. అయితే ఈ పార్టీకి సొంతంగా మెజార్టీ వచ్చే అవకా శాలు తక్కువ. కాకపోతే బహుముఖ పోటీ నేపథ్యంలో ఓట్లు ఎలా చీలతాయో చెప్పడం కొంత కష్టమే. 1972 నుంచి ఇప్పటివరకూ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఓటర్లు ఎల్లప్పుడూ ఒక పార్టీ లేదా కూటమి వైపే మొగ్గారు. ఈ సారి కూడా అదే పరిస్థితి కొనసాగుతుందా? లేదా? అన్నది వేచి చూడాలి.

**దేవభూమిలో రసవత్తర రాజకీయం...**

ఉత్తరప్రదేశ్ నుంచి వేరు చేయగా ఏర్పడ్డ పర్వతప్రాంత రాష్ట్రం ఉత్తరాఖండ్‌లో ఈసారి రాజకీయం రసవత్తరంగా ఉండనుంది. మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు నడుస్తోంది. నేడు ఓటింగ్ జరగనున్న ఈ రాష్ట్రంలో ఆమ్ ఆద్మీ పార్టీ తొలిసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. 2017లో మోదీ హవా కారణంగా బీజేపీ 47 శాతం ఓట్లతో మొత్తం 57 స్థానాలు దక్కించుకోగా, కాంగ్రెస్ 11 స్థానాలకు పరిమితమైంది. అయితే రాష్ట్ర నాయకత్వం విషయంలో బీజేపీ తీసుకున్న నిర్ణయాలు కొన్ని ఆ పార్టీ విశ్వసనీయతను కొంతవరకూ దెబ్బతీశాయి. ఐదు నెలల కాలంలోనే మూడుసార్లు ముఖ్యమంత్రులను మార్చడం, కుంభమేళా సందర్భంగా కోవిడ్ నిర్వ హణలో వైఫల్యాలు కాషాయ పార్టీని వెంటాడుతున్నాయి. నిరు ద్యోగం, ద్రవ్యోల్బణం, పర్వతప్రాంతాల నుంచి ప్రజల వలసలు కూడా బీజేపీకి ప్రతికూలంగా మారే అవకాశం ఉంది. అయితే యువ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ యువ ఓటర్లను ఆకర్షించగలడనీ, మోదీయోగీ వంటి అంశాలు ఓటర్లను ఆకర్షించవచ్చుననీ బీజేపీ ఆశలు పెట్టుకుని ఉంది. గత ఎన్నికల్లో ఘోర పరాభవం పొందిన కాంగ్రెస్ పార్టీ హరీశ్ రావత్ నేతృత్వంలో కొంతవరకూ కోలుకుందనే చెప్పాలి. ప్రభుత్వ వ్యతిరేకత, ఉత్తరాఖండ్ ఎన్నికల చరిత్ర తమకు అవకాశం కల్పిస్తాయన్న ఆశతో కాంగ్రెస్ ఉంది. ఒక పార్టీకి వరుసగా రెండుసార్లు అధికారం కట్టబెట్టే చరిత్ర ఇక్కడ లేకపోవడం గమనార్హం. అయితే కాంగ్రెస్ ఈ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందా అన్నది ఒక ప్రశ్న. పార్టీలో వర్గాలు, అంతర్గత కుమ్ములాటలు ఇందుకు కారణం. ఓట్‌షేర్ విషయంలో బీజేపీతో ఉన్న 13 శాతం అంతరాన్ని అధిగమించడం కాంగ్రెస్‌కు ఈసారి కొంత కష్టమే కావచ్చు. గాంధీ కుటుంబ సభ్యుల ప్రచారం, రైతు ఉద్యమం కారణంగా రైతుల్లో నెలకొన్న అసం తృప్తి వంటి అంశాలు రాష్ట్రంలోని టెరాయి ప్రాంతంలోని తొమ్మిది స్థానాల్లో తమకు ఓట్లు, సీట్లు తెచ్చిపెడతాయని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. ఇక్కడ రైతులు, సిక్కులు అధిక సంఖ్యలో ఉంటారు. రెండు జాతీయ పార్టీల హోరాహోరీ పోరు మధ్యలో ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ చేస్తుండటం ఆసక్తికరంగా మారింది. ఢిల్లీ తరహాలోనే 300 యూనిట్ల ఉచిత విద్యుత్తు, యువతకు నెలకు ఐదు వేల రూపాయల నిరుద్యోగ భృతి, పద్దెనిమిదేళ్ళ పైబడ్డ మహిళలకు నెలకు రూ.1000 పంపిణీ వంటి హామీలు ఆమ్ ఆద్మీ పార్టీకి కలిసి వస్తాయా అన్నది వేచి చూడాల్సిన అంశం. సీఎం అభ్యర్థిగా ఆర్మీ నుంచి పదవీ విరమణ చేసిన అజయ్ కొఠియాల్‌ను ఎంపిక చేసిన నేపథ్యంలో రాష్ట్రంలో ఆమ్ ఆద్మీ పార్టీ మెరుగైన ప్రత్యామ్నాయంగా మారింది. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందు నిర్వహించిన సర్వేల ప్రకారం... ఈసారి ఉత్తరాఖండ్‌లో పోటీ బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య మాత్రమే. కాకపోతే ప్రధాన పార్టీలు రెండూ తగినంత మెజార్టీ సాధించలేని పక్షంలో ఆమ్ ఆద్మీ పార్టీ కింగ్ మేకర్‌గా మారే అవకాశం ఉంది.

## సీతాకోకచిలకల హక్కు

పుట్టుకతోనే పైత్యం నూరిపోయడానికి
రంగం సిద్ధమైనట్టుంది
విద్యావనాల్లోనూ విషబుద్ధుల సాగు
మొదలయ్యింది!

ఒక చిరునవ్వు కోపమై చెలరేగిన దృశ్యం
ఒకానొక ఆత్మగౌరవ బద్దెమీద
అల్లాహూ అక్బర్ అని నినదించిన గొంతూ
దిక్కులన్నీ పరుచుకున్నాక
మీ అరుపుల వెనకున్న పరమ రహస్యం
బద్దలైపోయింది!

ఒకే ఒక రంగు ఏకఛత్రాధిపత్యమై ఎగురుతున్నాక
మూడు రంగుల్ని కలిపి పేనిన కాలమంతా
కుళ్ళికుళ్ళి ఏడవడం ఎవరికీ కనిపించడం లేదు
కుంటుకుంటూ నడుస్తున్న కొద్దిపాటి లౌకికం
వర్తమానం దిబ్బ మీద పూడ్చబడింది
రేపటికి ఏ వెర్రితనమై మొలకెత్తుతుందో..!!

అదిగో ...
అప్పుడే పసిహృదయాలు
మసిపూసుకు తిరుగుతున్నాయి చూడు
అందరం ఒక్కటని అనుకున్నాక
నువ్వొక్కడివే ఎక్కువెలా అవుతావ్
అన్ని వేళ్ళతో బిగిసిన పిడికిట్లోంచి
వేరుపడి ఎవర్ని వెక్కిరిస్తావ్?

ఆ మాటపై నియంత్రణ



ఆ తిండిపై నియంత్రణ ఆ నడకపై నియంత్రణ
ఆ ఒంటినీ ఒంటిమీద వస్త్రాన్నీ నియంత్రిస్తుంటే...
తొక్కిపెట్టబడ్డ తెగింపొకటి ఆకాశాన్ని చీల్చకమానదు
ఎక్కుపెట్టబడ్డ నినాదం ఏళ్ళనాటి మౌఢ్యాన్నీ
పొడుం పొడుంగా కూల్చకా మానదు

ఈ నేల పేడపురుగుల సొత్తు కాదు
సీతాకోకచిలకల హక్కు కూడా ..!

## క్రైస్తవుల స్వచ్ఛంద బొట్టుదారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**రాష్ట్రీయ క్రైస్తవ పరిషత్ అధ్యక్షుడు అద్దంకి రంజిత్ ఓఫిర్**



హైదరాబాద్(ప్రజాపాలన ప్రతినిధి) :దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని క్రైస్తవ స్వచ్ఛంద బొట్టుదారణ కార్యక్రమాన్ని నిజాంపేటలోని అగాపే ఫుల్ చర్చిలో నిర్వహించ నున్నట్లు రాష్ట్రీయ క్రైస్తవ పరిషత్ అధ్యక్షుడు అద్దంకి రంజిత్ ఓఫిర్ తెలిపారు. దేశంలో క్రైస్తవులు హిందువులకు వ్యతిరేకం అన్న అపవాదు తొలగించేందుకు వెయ్యి మంది మహిళలతో బొట్టు ధారణ కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేశామన్నారు. భారతీయ స్త్రీలు భారతీయ స్త్రీ లాగానే ఉండాలనే సదుద్దేశంతో బొట్టు లేకపోవడం వల్ల కుటుంబాలలో జరుగుతున్న అలజడులను తగ్గించేందుకు రాష్ట్రీయ క్రైస్తవ పరిషత్ ఆధ్వర్యంలో సామూహిక బొట్టు ధారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఇష్టమైన మతాన్ని పాటిస్తున్న మహిళలు బొట్టు లేకపోవడం వల్ల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. సుమారు వెయ్యి మంది వరకు మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందని చెప్పారు. తాము ఎవరినీ బలవంతం చేయడం లేదని స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారికి మాత్రమే ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తున్నట్లు తెలిపారు. అన్ని మతాల లోని మేధావులు ఈ కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన తో పాటు పలువురు రాష్ట్రీయ క్రైస్తవ పరిషత్ మహిళామణులు పాల్గొన్నారు.

## బూతు వారీగా వైఎస్సార్ టిపిని పటిష్ఠపరుద్దాం

**వైఎస్ఆర్ టిపి జిల్లా అధ్యక్షుడు తమ్మలి రాజు**



వికారాబాద్ బ్యూరో 14 ఫిబ్రవరి ప్రజాపాలన : బూతు వారీగా వైఎస్సార్ టిపిని పటిష్టపరిచేందుకు ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని వైఎస్ఆర్ టిపి జిల్లా అధ్యక్షుడు తమ్మలి రాజు పిలుపునిచ్చారు. సోమవారం పరిధిలోని సూర్య ప్రకాష్ టౌన్ లో గల వైఎస్సార్ టిపి కార్యాలయంలో జిల్లా మండల కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ తెలంగాణ పార్టీని గడపగడపకు చేర్చేందుకు కృషి చేద్దామని పేర్కొన్నారు. అన్ని సామాజిక వర్గాలకు మండల జిల్లా స్థాయి కమిటీలలో ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ అభివృద్ధికి పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని వివరించారు. పార్టీ శ్రేయస్సు కొరకు కార్యకర్తలు అందరము సమన్వయంతో ఐకమత్యంతో ముందుకు వెళ్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా రవీందర్ గుప్తా ఎస్సీ మహిళా అధ్యక్షురాలిగా ఏ రజిని క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు గా కె రాములు మైనార్టీ సెల్ అధ్యక్షులు గా గా నవాజ్ జిల్లా స్పోక్స్ పర్సన్స్ గా కోళ్ల యాదయ్య మామిడి సంగమేశ్వర్ బుస్సా రాఘవేందర్ రెడ్డి జిల్లా మీడియా ఇన్చార్జీలుగా నాగరాజు రమేష్ వెంకటేష్ శశి వర్ధన్ గౌస్ జిల్లా మహిళా కన్వీనర్ గా పి సుధారాణి జిల్లా యూత్ కన్వీనర్గా కొంపల్లి వేణులకు జిల్లా బాధ్యతలు అప్పగించామని స్పష్టం చేశారు. అలాగే నియోజకవర్గ కమిటీ సభ్యులను కూడా నియమించామని పేర్కొన్నారు.

సీతారామ ప్రాజెక్టు నిర్మాణం కొరకు భూములు కోల్పోయిన వారి నష్ట పరిహారం వెంటనే అందేలా చూస్తా హరీష్ రావు..

## తన్నీరు హరీష్ రావుకు వినతిపత్రం



పాలేరు పిబ్రవరి 14 ప్రజాపాలన ప్రతినిధి :సిద్ధిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయము నందు తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు శ్రీ తన్నీరు హరీష్ రావు, ని మర్యాదపూర్వకంగా కలిసి సీతారామ ప్రాజెక్టు నిర్మాణం కొరకు పాలేరు నియోజకవర్గ పరిధిలో భూములు కోల్పోయిన రైతులకు ఇంకా నష్టపరిహారం అందలేదని,సాధ్యమైనంత త్వరగా నష్టపరిహారాని రైతులకు అందించాలని కోరారు. కూసుమంచి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను 50 పడకలుగా పెంచాలని మరియు 24గంటలు సౌకర్యం కల్పించాల ని,డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేసిన పాలేరు శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి,కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు టిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## ప్రభుత్వ విప్,శాసనసభ్యులు ఆరేకపూడి గాంధి స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



శేరిలింగంపల్లి- ప్రజా పాలన / న్యూస్ :శేరిలింగంపల్లి నియోజకవర్గంలో డివిజన్ 106 పరిధిలో దుబే కాలనీ లోని 62 లక్షల అంచనా వ్యయంతో చేపట్టబోయే అండర్ గ్రౌండ్ (యు జి బి) నిర్మాణ పనులకు గౌరవ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆరేకపూడి గాంధీ ,స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తో కలిసి శంకుస్థాపన చేశారు ఈ కార్యక్రమంలో హెచ్ ఎం డబ్ల్యు ఎస్ అండ్ ఎస్ బి అధికారులు, డివిజన్ ప్రెసిడెంట్ రాజు యాదవ్,వార్డు మెంబర్ శ్రీ కళ, నితీష్,మున్ని నాయక్, పోషయ్య,అస్మద్ , బస్తి కమిటీ అధ్యక్షులు, బస్తి కమిటీ సభ్యులు మరియు స్థానిక కార్య కర్తలు,పాల్గొన్నారు.

## కేసీఆర్ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

**తెలుగుదేశం పార్టీ నాయకుల డిమాండ్**




బెల్లంపల్లి, ఫిబ్రవరి 14 , ప్రజా పాలన ప్రతినిధి: డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకుని దేశ ప్రజలకు బేషరతుగా గా క్షమాపణలు చెప్పాలని బెల్లంపల్లి పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నాడు స్థానిక బాబుక్యాంపు ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనీ రామ్ సింగ్ మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, గతంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ, ప్రభుత్వాలు ఏనాడు రాజ్యాంగం జోలికి పోలేదని అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లనే స్వేచ్ఛాయుత వాతావరణంలో లో కుల,మత బేధాలు లేకుండా శాంతియుతంగా జీవిస్తున్నారని అన్నాడు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లనే రిజర్వేషన్లు అమలవుతూ ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని, ఆయన రాసిన రాజ్యాంగం వల్లనే లక్షలాదిమంది బడుగు, బలహీన, దళితులకు, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు పొందుతున్నారని పేర్కొన్నారు. ఇవన్నీ కాదని తన మాటే నడవాలని తను ఏది చేసినా సక్రమంగానే ఉంటుందనే ఆలోచనతో తో కెసిఆర్ ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. , రాజ్యాంగాన్ని మార్చాలని చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, దేశ ప్రజలందరికీ కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మని రామ్ సింగ్ , తాళ్ళపెళ్ళి రాజేశ్వర్ లతో పాటు సీనియర్ నాయకులు రాజ్ కుమార్ పాండే, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## అస్సాం సిఎం హిమంత్ బిశ్వాస్ పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

**ధారూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లోళ్ల రఘువీరారెడ్డి**




వికారాబాద్ బ్యూరో 14 ఫిబ్రవరి ప్రజాపాలన : కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అస్సాం సీఎం హిమంత్ బిశ్వాస్ పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ధారూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పట్లోళ్ల రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. టీపీసీసీ అధ్యక్షులు ఎ. రేవంత్ రెడ్డి మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు ధారూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పట్లోళ్ల రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో ధారూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అస్సాం సీఎం పై వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేయాల్సిందిగా కోరారు. 48 గంటల్లో పోలీస్ అధికారులు స్పందించాలని తెలియజేయడం జరిగింది. కాంగ్రెస్ నాయకులకు సంస్కారం ఉంది కాబట్టి బీజేపీ నాయకులలాగా బరితెగించి మాట్లాడటం లేదని.. ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఊరుకునే పరిస్థితి ఉండదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మాజీ కార్యదర్శి బుజ్జయ్య గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కల్వ కిరణ్, నాయకులు బాబాఖాన్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ అశోక్ ముదిరాజ్, నాయకులు ప్రవీణ్ రెడ్డీ, యాదయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

## రెచ్చిపోతున్న కేటుగాళ్లు




ఇబ్రహింపట్నం ఫిబ్రవరి14 ప్రజాపాలన ప్రతినిధి : రంగారెడ్డి జిల్లా యాచారం మండలం తేది. 22/01/2022 రోజున తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన గోలీ నర్సింహా తన గ్రామములో గృహ నిర్మాణం చేసుకుంటుండగా ఉదయం సమయంలో ఎవరో ఇద్దరు వ్యక్తులు నర్సింహాను సంప్రదించి తమకు బాలాపూర్ లో సిమెంట్ షాప్ ఉన్నదని తక్కువ రెట్లకే సిమెంట్ సరఫరా చేస్తామని నమ్మించి అతని వద్ద ఫోన్ పే రూపములో డి డి తీసి సిమెంట్ పంపుతామని అందుకు అతని వద్ద 17400/- ఫోన్ పే చేపించుకొని అట్టి ఫోన్ పే నంబర్ తీసివేసి తప్పించు కొని తిరుగుతుండగా చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించన యాచారం పోలీస్ లు టవర్ లోకేషన్ ఆదరంగా ఆటివారు అయినా %ూ%1:వరికుప్పల. నరేష్, వయసు. 26 సంవత్సరాలు మరియు %ూ%2:వరికుప్పల శ్రీనివాస్,24 సంవత్సరాలు ఇద్దరు మన్నెగూడ %ఎ/శీ% నేదునూరు గ్రామం కందుకూరు మండలం రంగారెడ్డి జిల్లా వారీగా గుర్తించి వారిని విచారించాగా వారు తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన నర్సింహా వద్దకు వెళ్లి మోసం చేసి అతనితో డీల్ కుదుర్చుకొని ఆఫీస్ దగ్గరకు వెళ్ళాక ఫోన్ చేస్తాము డబ్బులు పంపించిగానే సిమెంట్ లోడ్ పంపుతామని చెప్పి నమ్మించి అక్కడ నుండి ఇద్దరు చింతపల్లి పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి అక్కడ బంకులోని క్యాషియర్ తో తమకు తమ సోదరుడు డబ్బులు పంపుతాడు మాకు గూగుల్ పే ఫోన్ పే లేదని అబద్ధం చెప్పి అతని ఫోన్ పే కు డబ్బులు వేయుంచుకున్నారు అని వాళ్ళు చేసిన నేరాన్ని ఒప్పుకున్నారు అట్టి వారిని తేది:14/02/2022 రోజున యాచారం సిఐ లింగయ్య ఆదేశాల మేరకు దర్యాప్తు అధికాని వి. ప్రసాద్ యస్ ఐ ఆఫ్ పోలీస్ మరియు వారి సిబ్బంది అదుపులోకి తీసుకోని రిమాండ్ కు తరలించారని వారు అని తెలిపారు.

## ఆళ్ళపాడు అంగనవాడి లో శ్రీమంతం కార్యక్రమం



బోనకల్ ,ఫిబ్రవరి 14 ప్రజా పాలన ప్రతినిధి: బోనకల్ మండలం అళ్లపాడు ప్రాథమిక పాఠశాలలో గ్రామ సర్పంచ్ మర్రి తిరుపతిరావు మధ్యాహ్న భోజనం అనంతరం అంగన్వాడీ స్కూల్ లో అర్వపల్లి లక్ష్మి తిరుపతమ్మ శ్రీమంతం కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ మర్రి తిరుపతిరావు మాట్లాడుతూ ఆళ్లపాడు అంగన్వాడీ కేంద్రం లో ప్రతి నేల శ్రీమంత కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా గర్భిణీ స్త్రీలను గుర్తించడం వలన ప్రతి నేల వారికి ఇచ్చే పోషక పదార్థాలు వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోనుటకు విలు ఉంటుందని ఇలాంటి కార్యక్రమాలు చేయటం ద్వారా గర్భిణీ స్త్రీలు ఆందరు తగిన జాగ్రత్తలు తిసుకో నుటకు ఉత్సాహంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమం నిర్వహిస్తూన్న అంగన్వాడీ టీచర్లలను సర్పంచ్ అభినందించినారు. అనంతరం పాఠ శాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన చేసి పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ భోజనం ఏలా ఉంటుంది అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. మేను ప్రకారం పిల్లలకు భోజనం పేట్టాలనీ మంచి రుచికరమైన ఆహారం వడ్డించాలని మధ్యాహ్న భోజన కార్మికులను కోరారు. మధ్యాహ్న భోజనం బిల్లు లు సకాలంలో చెల్లించడం లేదు అని వారు కొరారు. ప్రభుత్వం %న%నుంచి రావాల్సిన మధ్యాహ్నాం భోజనం బిల్లు లు వేంటనే విడుదల చేయాలని సర్పంచ్ మర్రి తిరుపతిరావు కొరారు బిల్లు లు సకాలంలో చెల్లిస్తే పిల్లలకు మంచి రుచికరమైన ఆహారం వడ్డించుటకు మధ్యాహ్నాం భోజనం కార్మికులకు బిల్లు లు విడుదల చేసి వారికి నిరుత్సాహం లేకుండా చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు చింతల రవి ,అంగన్వాడీ టీచర్లు పద్మ ,హుస్సేన్ బీ ,గౌరమ్మ పంచాయతీ సిబ్బంది నాగరాజు పాల్గొన్నారు.

## పుట్టినరోజు సందర్భంగా మంత్రి మల్లారెడ్డి ఆశీస్సులు తీసుకున్న డిప్యూటీ మేయర్ శివ కుమార్ గౌడ్



మేడిపల్లి, ఫిబ్రవరి 14 (ప్రజాపాలన ప్రతినిధి) : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని కార్మిక శాఖ మంత్రివర్యులు చామకూర మల్లారెడ్డి నివాసంలో ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం మంత్రిమల్లారెడ్డి, పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డిలు శివ కుమార్ గౌడ్ తో కేక్ కటింగ్ చేయించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కోల్తూరి మహేష్, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుర్ర శ్రీకాంత్ గౌడ్, పప్పుల అంజిరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ రాందాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అస్సాం సీఎం పై బోనకల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



బోనకల్, ఫిబ్రవరి 14 ప్రజా పాలన ప్రతినిధి:బోనకల్ మండలం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోజాతీయ నాయకుడు రాహుల్ గాంధీ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అస్సాం ముఖ్యమంత్రి హేమంత్ విశ్వ శర్మ పై టీపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ,మధిర శాసనసభ్యులు సీఎల్పీ లీడర్ మల్లు భట్టి విక్రమార్క ఆదేశంతో సోమవారం బోనకల్ పోలీస్ స్టేషన్ లో బోనకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాలి దుర్గారావు, ఖమ్మం జిల్లా డిసిసి కార్యదర్శి పైడిపల్లి కిషోర్ బాబు బోనకల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కర్నాటి కోటి, చొప్పకట్లపాలెం సర్పంచ్ సుబ్బారావు, నల్లమోతు సత్యనారాయణ, కో ఆప్షన్ సభ్యులు జమాలుద్దీన్, బద్రు నాయక్ ,బానోత్ శీను. చేబ్రోలు మల్లికార్జున్, మురళి, దొంతు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ కు నివాళులు అర్పించిన ఈటెల

**భారీ గా తరలివచ్చి ఘనస్వాగతం పలికిన బిజెపి శ్రేణులు**



జన్నారం రూరల్, ఫిబ్రవరి 14, ప్రజా పాలన: నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం గొడిసెర్యాల లోని రాజరాజేశ్వరి స్వామి ఆలయం పూజా కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతూ మాజీ మంత్రి ఈటల రాజేందర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం కు పూలమాల వేసి నివాళు లర్పించారు, అనంతరం మేదరి కులస్తులు తమపై పారెస్టు ఆఫీసర్లు దాడులు చేస్తున్నారని , తమని ఎస్టీ జాబితాలో చేర్చాలని, దీనిపై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని మాజీ మంత్రి హుజరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ కు వినతి పత్రం అందజేశారు. అంతకముందు తపాల పూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీలు వివేక వెంకటస్వామి, రమేష్ రాథోడ్, మంచిర్యాల జిల్లా బిజెపి అధ్యక్షుడు బిజెపి రఘునాథ్ వేరవెల్లి, జన్నారం మండలం బిజెపి అధ్యక్షుడు గోలి చందు, మండల బిజెపి కార్యదర్శి, ఎరుకల రమేష్ గౌడ్, నాయకులు జక్కుల సురేష్, కొంతం శంకరయ్య తదితరులున్నారు.

## పేదవాడి నడ్డి విరుస్తున్న ఇసుక, మట్టిమాఫియా



బోనకల్, ఫిబ్రవరి 14 ప్రజాపాలన ప్రతినిధి: మండల వ్యాప్తంగా ఇసుక మట్టి మాఫియా పేదవాడి పాలిట శాపంగా మారాయి. సరైన అనుమతులు లేకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా అధిక ధరలకు విక్రయిస్తూ సామాన్య ప్రజలను ఇసుక ,మట్టి మాఫియా జలగ లాగా పీక్కు తింటున్నారు. మండల వ్యాప్తంగా ఎవరైనా సామాన్యుడు నూతనంగా నిర్మాణం చేపట్టాలంటే ఇసుక , మట్టి తొలకాలను అధిక ధరలను చెల్లిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇసుక మరియు మట్టి తోలకాలు చేపట్టేవారు సిండికేట్ గా తయారయ్యి వారి వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిస్తున్నారు. మండలంలో ఒక ట్రక్కు మట్టి కావాలంటే 1500, ఒక ట్రక్కు ఇసుక కావాలంటే 6000 చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యాపారులు అందరూ సిండికేట్ గా మారటం వలన తప్పనిపరిస్థితుల్లో అధిక ధరలు చెల్లించి ఆర్థికంగా నష్టపోతున్నారు. సామాన్యులు అంత ధరలు చెల్లించుకోలేక నిర్మాణాలను చేపట్టకుండా వాయిదా వేసుకుంటున్నారు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతుందని సామాన్యులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సిండికేట్ వ్యాపారస్తుల పై తగిన చర్యలు తీసుకొని సామాన్యులకు అందుబాటులోకి ఇసుక మట్టి తోలకాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

## ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ నిఖిల**



వికారాబాద్ బ్యూరో 14 ఫిబ్రవరి ప్రజాపాలన : ప్రజల నుండి వచ్చే భూ సమస్యలపై ధ, ం ణి లో ప్రాధాన్యత తో ఎ ం ట నే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నిఖిల తహసీల్దార్లను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరములో తహసీల్దార్లతో కలసి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ, ధరణి సమస్యలకు మండల పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలను అక్కడి కక్కడే పూర్తి బాధ్యతతో పరిష్కరించి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. ఏ చిన్న సమస్యకైనా కలెక్టర్ కార్యాలయానికి వెళ్ళండి అని ప్రజలకు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి పంపకుండా, ధరణి సమస్యను ముందుగా తహసీల్దార్లు అర్థం చేసుకొని సాధ్యమైతే అట్టి సమస్యను అక్కడికక్కడే పరిష్కరించాలని, లేదా వారికి తగు సలహాలు సూచనలు అందజేసి సహకరించాలన్నారు. అర్థం కాని ధరణి సమస్యలకు టెక్నికల్ టీమ్ లకు కాల్ చేసి సమస్యను పరిష్కరించే దిశగా తహసీల్దార్లు కృషి చేయాలన్నారు. ప్రజల సమస్యల పట్ల మండల స్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక నుండి ధరణి సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లతో పాటు ఆర్డిఓ లు కూడా తప్పకుండా పాల్గొనాలని సూచించారు. ధరణి సమస్యల పరిష్కారంలో భాగంగా ఈరోజు ప్రజల నుండి (90) ఫిర్యాదులు స్వీకరించి, కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కరించడం జరిగింది. మిగితా సనస్యలను తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించాలని, అవసరమైన సలహాలు, సూచనలు ప్రజలకు అందించి వారికి సహకరించాలని కలెక్టర్ తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, వికారాబాద్ ఆర్డిఓ విజయకుమారి, కలెక్టర్ కార్యాలయ ఏఓ హరిత, అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | |
|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | చేవెళ్ల | 9849526878 |
| డి. వరప్రసాద్ | తెల్లాపూర్ | 9553999990 |
| నరోత్తమ్‌రెడ్డి | మేడిపల్లి | 9346970159 |
| వెంకటచారి | మందమర్రి | 9440868581 |
| వెంకటస్వామి | మంచిర్యాల | 9515048103 |
| కళ్యాణ్ సి.ఎం. | కూకట్‌పల్లి | 7842672389 |
| ఎం. గైబులు | వికారాబాద్ | 9704570475 |
| టి.రాంబాబు | శేర్లింగంపల్లి | 6301925113 |
| సత్య కిషోర్ | సిద్దిపేట | 6309723472 |
| బోడ మనోహర్ నంద | కరీంనగర్ | 9492927684 |
| బోడ మమత | జగిత్యాల | 9491127684 |
| రాజేందర్ ప్రసాద్ | ఖమ్మం | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | మధిర | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | పాలేరు | 9848895405 |
| ఆర్.రాజేశ్వర్ రావు | మయూర్ సెంటర్ | 9160400339 |
| మాలేడు నరేందర్ | ఖమ్మం రూరల్ | 8074550397 |
| టిఎస్.చక్రవర్తి | ఖమ్మం టౌన్ | 9948327333 |
| కోన.నరసింహారావు | మధిర రూరల్ | 9949426541 |
| ఆర్.శ్రీనివాస్ | ఎర్రుపాలెం మండలం | 8501020885 |
| బుక్య.శ్రీను | బోనకల్ | 868810293 |
| రత్నకిషోర్ నంద్రు | ఎర్రుపాలెం | 8142196692 |
| సి.మల్లేష్ | ఇబ్రహీపట్నం | 9618028334 |
| భుక్య శ్రీను | బోనకల్ | 86881020885 |
| సాయికృష్ణ | వైరా | 9951486635 |
| పి.పండు | చేవేళ్ల | 9963293635 |
| గొల్లపూడి దశరధన్ | జిల్లేడు, చౌదరిగూడ | 9951334682 |
| పుప్పాల కిరణ్ కుమార్ | రాజేంద్రనగర్ | 9666603538 |


## అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణించిన కామ్రేడ్ తాండ్ర కుమార్




శేరిలింగంపల్లి -ప్రజా పాలన/ న్యూస్ : శేరిలింగంపల్లి ఎంసిపిఐయూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ తాండ్ర కుమార్ అనారోగ్యంతో మృతి చెందారు. తీవ్ర అనారోగ్యంతో సికింద్రాబాద్ లోని కిమ్స్ హాస్పిటల్ లో నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మరణించారు. తాండ్ర కుమార్ మరణం కమ్యూనిస్టు పార్టీ నాయకులు, ఆయా పార్టీల నాయకులు దిగ్ర్బాంతి వ్యక్తం చేశారు. ఎంతోమంది పేద వారిని ఆదుకుని వారికి గూడు నీడ ఏర్పాటు చేశారు ఆయన మహోన్నత వ్యక్తి సమాజ సేవకై పాటుపడిన మహానుభావుడు ప్రతినిత్యం పేదవారి కోసం పాటుపడే వ్యక్తి పేద వారి కోసం లాఠీ దెబ్బలను లెక్క చేయకుండా ఎదురు నిలబడిన కామ్రేడ్ ఎర్ర చుక్క సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు బాగ్ లింగంపల్లిలోని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యాలయం ఓంకార్ భవన్ లో ప్రజల దర్శనార్థం కామ్రెడ్ తాండ్ర కుమార్ భౌతిక దేహాన్ని ఉంచనున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ముజాఫ్ఫర్ నగర్ ఆఫీస్ వద్దకు తీసుకెళ్లనున్నారు. ఈరోజు సాయంత్రం 5 నుంచి రేపు ఉదయం అంత్యక్రియలు అయ్యేవరకు మియాపూర్ ని వారి ఇంటి వద్ద మృతదేహం ఉంచబడును. 15వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు ఆయన స్వస్థలమైన మియాపూర్ లో అంత్యక్రియలు జరగనున్నాయి.

## గోపన్ పల్లి లో అభివృద్ధి పనుల తనిఖీ నిర్వహించిన గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



శేరిలింగంపల్లి- ప్రజా పాలన : శేరిలింగంపల్లి- నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలో గోపన్ పల్లి లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డులు పనులను, కాలనీ వాసులతో కలిసి పరిశీలించిన గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి. నాణ్యతా విషయంలో ఎక్కడా కూడా రాజీ పడకుండా నిర్ణీత సమయంలో సీసీ రోడ్డులు పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ ఆదేశించారు.ప్రజలకు మేలైన మౌలిక వసతుల కల్పనకు పూర్తిగా కట్టుబడి ఉన్నామని తెలియజేశారు అనంతరం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి గోపన్ పల్లి వాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కొత్త సీసీ రోడ్డులు పనులను అధికారులతో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మన్నే రమేష్, రంగస్వామి, మురగ,చిన్న,మధు,విష్ణు, శ్రీకాంత్, సత్యనారాయణ,సాయి,సతీష్,భీమాజీ, రాజు,సుబ్బా రావు,గోపన్ పల్లి కాలనీ వాసులు, నాయకులు , కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

## గ్రామాల్లో ప్రతి కుటుంబానికి బ్యాంక్ సేవలు: జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



ఆసిఫాబాద్ జిల్లా ఫిబ్రవరి 14 (ప్రజాపాలన, ప్రతినిధి) :జిల్లాలోని ప్రతి గ్రామంలో కుటుంబానికి బ్యాంకు సేవలు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన వార్షిక అక్షరాస్యత వారోత్సవాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏ,జి,ఎం, సంజీవ్ కుమార్ సాహూ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కోవ హనుమంత్ రావు ల తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు ప్రతి సంవత్సరం నిర్వహించడం జరుగుతుందని, గ్రామాలలో ప్రతి కుటుంబానికి బ్యాంకు సేవలు అందుబాటులోకి తీసుకురావడం, కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఉచిత నగదు వినియోగం, డిజిటల్,పేమెంట్ ఆన్లైన్ బ్యాంకింగ్, సైబర్ క్రైం నియంత్రణ తదితర అంశాలపై కల్పించడం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. తిర్యానీ, దహెగాం, జైనూర్ లలో అక్షరాస్యత కేంద్రాలను చేయడం జరిగిందని, ఈ కేంద్రాల ద్వారా 9 గ్రామాలకు సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు శాఖల మేనేజర్లు, అక్షరాస్యత కేంద్ర సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## వార్డెన్ పోస్ట్ ను వెంటనే భర్తీ చేయాలి

**ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దుంపల కుమార్ డిమాండ్**




మంచిర్యాల టౌన్, ఫిబ్రవరి14,ప్రజాపాలన: మంచిర్యాల జిల్లా భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో భీమారం మండల కేంద్రంలో ఉన్న ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దుంపల కుమార్ మాట్లాడుతూ, ఆశ్రమ పాఠశాలలో హాస్టల్ వార్డెన్ గత నెలరోజుల కిందట బదిలీపై వెళ్లడం జరిగింది. బదిలీపై వెళ్లిన అనంతరం వార్డెన్ పోస్టు భర్తీ చేయకుండా , ఇన్చార్జి బాధ్యతలు ఎవరికి ఇవ్వకుండా అలాగే ఉంచి నా అధికారులు, దీని గురించి సంబంధిత పాఠశాల హెచ్ ఎం ని అడిగితే హాస్టల్ గురించి నాకు ఏమీ తెలియదని, నాకు సంబంధం లేదు అంటూ చెప్పారు అని అన్నారు. దీంతో నిత్యం విద్యార్థులకు అసలు ఎవరు భోజనం పెడుతున్నారు,ఎవరు చూసుకుంటున్నారు, విద్యార్థులకు రక్షణ కు ఎవరు అని,అసలు హాస్టల్ లో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడుతుందని.వీటి పైన అనేక సందేహాలు వస్తున్నాయని. గత మూడు సంవత్సరాలుగా పనిచేయని ఆరో వాటర్ ప్లాంట్,విద్యార్థుల పోస్టికాహారం అందించే అటువంటి మెనూ పూర్తిగా అమలు కావడం లేదని. భోజనం రుచిగా ఉండటం లేదని. ఇప్పటికైనా ఉన్నతాధికారులు హాస్టళ్ ను సందర్శించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని లేని యెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఐటి పాములా సానిత్, మండల ఉపాధ్యక్షుడు ఆరెందల రవితేజ సభ్యులు అజయ్,సాయి,తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

## ఏ ఐ సి సి అధ్యక్షులు రాహుల్ గాంధీకి అస్సాం ముఖ్యమంత్రి హిమంత్ బిస్వా శర్మ తక్షణమే క్షమాపణ చెప్పాలి



పాలేరు పిబ్రవరి 14 ప్రజాపాలన ప్రతినిధి : తెలంగాణ పి సి సి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి,తెలంగాణ సియల్ పి లీడర్ మల్లు భట్టివిక్రమార్క,ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పు వ్వాల దుర్గాప్రసాద్, పిలుపు మేరకు ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ పరిధిలోని నేలకొండపల్లి మండలం కేంద్రంలో మాజీ ఏ ఐ సి సి అధ్యక్షుడు రాహుల్ గాంధీ గారి మీద అస్సాం ముఖ్యమంత్రి హిమంత్ బిస్వా శర్మ అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా ర్యాలీ నిర్వహించి అనంతరం నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ లో ఏ ఎస్ ఐ కోడేత్రాచు, కి అస్సాం ముఖ్యమంత్రి మీద చర్యలు తీసుకోవాలి అని నేలకొండపల్లి మండలం కాంగ్రెస్ కమిటీ పిర్యాదు. చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ సేవాదళ్ కన్వీనర్ బచ్చలికూరి నాగరాజు, కోరట్లగూడెం యంపిటీసీ రేగూరి వాసవి, ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు భూక్య చిన్న నాయక్, మాధార్, నేలకొండపల్లి మండల యువజన కాంగ్రెస్ నాయకులు యడవల్లి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాక్టికల్ సిలబస్ పూర్తి చేయాలి: డిఐఈఓ డా శ్రీధర్ సుమన్



ఆసిఫాబాద్ జిల్లా పిబ్రవరి 14 (ప్రజాపాలన, ప్రతినిధి) : జిల్లా లోని ఇంటర్ కళాశాలల్లో ప్రాక్టికల్ సిలబస్ ను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి (డిఐఈఓ) డా శ్రీధర్ సుమన్ అన్నారు. సోమవారం స్థానిక కళాశాలల్లో విద్యార్థుల సాధనను పరిశీలించారు. ఈ సందర్భంగా అధ్యాపకులకు పలు సూచనలు చేసారు. ఇంటర్ బోర్డు టైంటేబుల్ ప్రకారం మర్చి 23 నుండి ఏప్రిల్ 8 వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించబడుతాయ ని, సైన్స్ సబ్జెక్ట్ అధ్యాపకులు ప్రయోగ పరీక్షలకు నిర్దేశించబడిన 70 శాతం సిలబస్ను విద్యార్థులచే స్వయంగా అభ్యసనం చేయించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అన్నారు. బోర్డు నిర్వహించబోయే పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఆదేశించారు. కళాశాలలో ప్రయోగ సామాగ్రి చోటు లేకుండా విద్యార్థులకు తగు శిక్షణ ఇవ్వాలని ప్రిన్స్ పాళ్లను ఆదేశించారు.

## అస్సాం సీఎం పై బెల్లం పల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు




బెల్లంపల్లి , ఫిబ్రవరి 14, ప్రజా పాలన ప్రతినిధి: అస్సాం ముఖ్యమంత్రి హేమంత్ బిశ్వ శర్మ పై తక్షణమే కేసు నమోదు చేయాలని బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక ఒకటవ పోలీస్టేషన్లో సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ పై అనుచిత వ్యాఖ్యలు చేసి కించపరిచిన ఉదంతంపై అస్సాం ముఖ్యమంత్రి హేమంత బిశ్వ శర్మ పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కంకటి శ్రీనివాస్ తో పాటు 23 వ వార్డు కౌన్సిలర్ గుజ్జ రవి. మాజీ కౌన్సిలర్ లు రొడ్డ శ్యామ్, చింతపండు శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా ఎన్ఎస్యుఐ అధ్యక్షుడు ఆదర్శ వర్ధన్ రాజు, ఎనగందుల వెంకటేష్, ఎలుక ఆకాష్, ఎం, శివ, తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీపై అస్సాం ముఖ్యమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదు



ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి ప్రజాపాలన ప్రతినిధి :పైన అస్సాం ముఖ్యమంత్రి హేమంత్ బిస్వా శర్మ చేసిన అనుచిత వ్యాఖ్యల పై కండిస్తు లిటీపీసీసీ అధ్యక్షులు శ్రీ రేవంత్ రెడ్డి గారు మరియు భువనగిరి పార్లమెంట్ సభ్యుడు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం రోజు ఆదిభట్ల మున్సిపాలిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫిర్యాదులు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చెయ్యడం జరిగింది మరియు బొంగులూరు చౌరస్తా వద్ద రాస్తారోకో చేయడం అయ్యింది. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకుడు మర్రి నిరంజన్ రెడ్డి మరియు శేఖర్ మామ మరియు ఆదిభట్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్ మరియు యాంజల్ మున్సిపాలిటీ అధ్యక్షురాలు కొత్త కుర్మా శివ కుమార్ మంగమ్మ మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు కొత్త కుర్మా యశ్వంత్ ఆదిభట్ల కౌన్సిలర్లు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## హిమాంత్ బిశ్వాస్ శర్మ పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి: నీలం పద్మ



యాదాద్రి భువనగిరి జిల్లా 14 ఫిబ్రవరి ప్రజాపాలన: ఆలేరు పోలీసు స్టేషన్ లో అస్సాం ముఖ్యమంత్రి హిమాంత్ బిశ్వాస్ శర్మ పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కంప్లైంట్ చేసిన మహిళ కాంగ్రెస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ నీలం పద్మ.యాదాద్రి జిల్లా ఆలేరు పోలీసు స్టేషన్ లో సోమవారం నాడు రాహుల్ గాంధీ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అస్సాం ముఖ్యమంత్రి హిమాంత్ బిశ్వాస్ శర్మ పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఆలేరు పోలీస్ స్టేషన్లో అధ్యక్షులు కార్యదర్శి నాయకుల ఆద్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఎస్సిసెల్ స్టేట్ కన్వీనర్ నీలం వెంకటస్వామి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వివిధ గ్రామాల నుండి వచ్చిన నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# నేను పుట్టి పెరిగిన ప్రపంచం..



బిఎస్.రాములు

## కొన్ని దృశ్యాలు

ఆ కాలంనాటి ఒక సంఘటన గురించి వివరాలకోసం మాజీమంత్రి ప్రస్తుత ఎమ్మెల్సీ మిత్రుడు తాటిపర్తి జీవన్‌రెడ్డిగారికి ఫోన్ చేశాను. ఆ వివరాలన్నీ ఇప్పుడెందుకే అని అన్నాడు. జీవన్‌రెడ్డి 1982లో మల్యాల మండలాధ్యక్షుడిగా చేసి, 1983లో ఎన్.టి.ఆర్. టిడిపి తరఫున జగిత్యాల ఎమ్మెల్యేగా పోటీ చేసి ఎమ్మెల్యే అయ్యాడు. జీవన్‌రెడ్డితో మా తరంవాళ్ళు రాజకీయాల్లో ప్రవేశించడం, గెలవడం ప్రారంభమైందని చెప్పవచ్చు. జీవన్‌రెడ్డికన్నా ముందువాళ్ళంతా పాతతరాలకింద లెక్క. జీవన్‌రెడ్డి తన జీవితచరిత్రను రాయించాల్సిన అవసరం ఉంది. ఆయన ద్వారా జగిత్యాల ప్రాంత సామాజిక, రాజకీయ చరిత్ర పరిణామాలు ఎన్నో రికార్డు చేయవచ్చు. ఇప్పటికైనా పూనుకోవాలి. జీవన్‌రెడ్డి జగిత్యాల హైస్కూల్‌లోనే మాతోపాటు చదువుతుండేవాడు. ఏడవ తరగతి చదువుతున్నప్పుడు 1961లో ఒక హత్య జరిగింది. పాత బస్టాండులోని మల్టీపర్పస్ హైస్కూలులో ఉదయం సెషన్ తరువాత బడి వదిలిపెట్టారు. మధ్యాహ్నం తినడానికి ఇంటికి గబగబా నడుస్తున్నాను. బడి వదిలినప్పుడు రోడ్డంతా విద్యార్థుల ఊరేగింపులాగా నిండుగా కనబడేది. పోలీస్ స్టేషన్ వెనకేగల జీవన్‌రెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి అడ్వకేట్ ఇల్లు వుండేది. మా స్కూల్లో ప్రతి క్లాసు ఎనిమిది సెక్షన్లు వుండేవి. జీవన్‌రెడ్డి వేరే సెక్షన్‌లో వుండేవాడు. 13 ఏళ్ల వయస్సులో జీవన్ రెడ్డి సన్నగా సుడిగాలి వస్తే కొట్టుకుపోయేట్టుగా వుండేవాడు. వాళ్ల నాన్నను చంపారని వార్త తెలిసింది. ముగ్గురు ఆగంతకులు నిండా గొంగళి కప్పుకొని ముందు ఒకరు దండం పెడుతున్నట్టుగా కాళ్లు పట్టుకున్నారని. మరొకరు గొంగట్లో దాచుకున్న కత్తితో పొడిచారని. మరొకరు కదలకుండా పట్టుకున్నారని అన్నారు. ఆ దృశ్యం ఊహించేసరికి భయం వేసి ఇంటికి పరుగెత్తాను. అమ్మకు చెప్పాను. రామచంద్రారెడ్డి అడ్వకేట్ తాను చదువుకుంటున్నప్పుడు మన ఇంట్లోనే కిరాయికి వుండి చదువుకున్నాడు. అప్పుడు మన ఇల్లు బుక్కవాడలో గుండేటి వాళ్ల ఇంటిపక్కన వుండేది. ఇంటిముందు గేటు పెట్టడంతో ఆ స్థలాన్ని వారికి అమ్మేసి అక్కడి ఇల్లు, మట్టి అంతా ఇక్కడికి జారగొట్టి ఈ ఇల్లు కట్టారు అని చెప్పింది. జీవన్‌రెడ్డి సొంతూరు బతికెపెల్లిలో 60 ఏళ్ల నుండి రాయలసీమలో లాగా కక్షలు, గ్రూపులు, హత్యలు, కోర్టు కేసులు సాగేవి. బతికెపెల్లి అంటేనే బద్మాష్ బతికెపెల్లి అని పేరు పోయింది. ఏదో కేసులో హంతకులకు అన్యాయం జరిగిందని పగతీర్చుకోడానికి వచ్చి రామచంద్రారెడ్డిని చంపివేశారని తెలిసింది. ఆ హత్య తర్వాత జగిత్యాలలో వుంటే కొడుకును కూడా చంపేస్తారని జీవన్‌రెడ్డిని తీసుకొని కరీంనగర్ స్కూల్లో చేర్పించారు. బాల్య స్నేహితుడు ఉప్పులంచ శంకర్ సమీప బంధువైన కస్తూరి లక్ష్మణ్ బాబు 1962లో శాసనసభకు ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఓడిపోయాడు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఉప్పులంచ ఈశ్వరయ్య ఇండిపెండెంట్‌గా పోటీ చేశాడు. అప్పుడు ఓట్ల కౌంటింగ్‌లో మేనేజ్ చేసి జె. చొక్కారావు ఎంపిక అయ్యాడని ఈశ్వరయ్య చెప్తుండేవాడు. తమ పద్మశాలి కులస్థుడే ఓటు వేయలేదని, కులస్థులు ఓటు వేసి ఉంటే గెలిచి ఉండేవాడినని అంటుండేవాడు. కస్తూరి లక్ష్మణ్‌బాబు కూడా ఇలాగే స్వంత కులస్థులు ఓటు వేయలేదని చాలా బాధపడ్డాడు. 1962 ఎన్నికల్లో జగిత్యాల ఎమ్మెల్యేగా అంతర్గాంకు చెందిన ధర్మారావు గెలిచాడు. ఆయనపై కేసు వేయడంతో ఆయన ఎన్నిక చెల్లదని కొట్టివేయబడింది. అప్పుడు దాంతో 1963లో ఉప ఎన్నికలు జరిగాయి. కస్తూరి లక్ష్మణ్‌బాబుకు సైకిల్, రేడియోల షాపు ఉండేది. వాళ్ళ అన్న కస్తూరి పెద్ద రాజనర్సయ్య పద్మశాలి సంఘానికి పెద్దమనిషిగా పనిచేస్తుండే వాడు. కస్తూరి లక్ష్మణ్‌బాబు తండ్రి కస్తూరి నర్సింహులు కుల పంచాయితీలు చెప్తూ మంచి మనిషిగా చుట్టుప్రక్కల పేరు పోయాడు. ఆయన చిన్న కొడుకు కస్తూరి లక్ష్మణ్‌బాబు బీసీ చైతన్యంతో ఇండిపెండెంట్‌గా శాసనసభకు పోటీ చేయడానికి మెట్‌పల్లిలో 1953 నుండి గంగుల భూమయ్య పద్మశాలి ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా గెలుస్తూ రావడం ఒక స్ఫూర్తి. అలాగే బుగ్గారం నియోజకవర్గం నుండి అంబళ్ల రాజారాం పద్మశాలి, కడకుంట్ల గంగారాం పద్మశాలి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. అలాగే తాను కూడా గెలవాలని జగిత్యాల నియోజకవర్గంలో పోటీ చేశాడు. జగిత్యాల నియోజకవర్గంలో వున్న పద్మశాలీలు, బీసీలు ఆయనేం గెలుస్తాడని హేళన చేస్తూ వెలమలకు మద్దతు ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్యం తెచ్చిందని, ఇప్పుడు ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తే గెలిపిస్తారా అని విమర్శించారు. ఓడిపోయిన కస్తూరి లక్ష్మణ్‌బాబు ఆ షాక్ నుండి తేరుకోలేదు. తనలో తాను నిరాహార దీక్ష చేసి కొన్నాళ్ళకు ఆత్మహత్య చేసుకున్నాడు.

(మిగతాభాగం రేపటి సంచికలో..)

## విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలి: ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



బెల్లంపల్లి ఫిబ్రవరి 14 ప్రజా పాలన ప్రతినిధి: విద్యార్థినీలందరూ బాగా చదువుకుని జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సూచించారు.సోమవారం నాడు బెల్లంపల్లి నియోజకవర్గం కాసిపేట మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి వసతులపై ఆరా తీశారు. అనంతరంఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన కస్తూర్బా గాంధీ విద్యాలయంలో చదువుతున్న విద్యార్టినీలందరు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మి , వైస్ ఎంపీపీ విక్రమ్, జడ్పీటీసీ చంద్రయ్య, మండల తెరాస పార్టీ అధ్యక్షుడు రమణారెడ్డి , మండల ఎంపీటీసీలు, సర్పంచ్ లు, ఇతర ప్రజాప్రతినిధులు, టిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## విప్పలమడక గ్రామంలో హిందూ స్మశాన వాటిక పనులు చేపట్టాలి వార్డు సభ్యులు ఫిర్యాదు



వైరా మండలం విప్పలమడక గ్రామంలో హిందూ శ్మశాన వాటికలో వైకుంఠ ధామం నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామంలోని వార్డు సభ్యులు స్థానికులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు గ్రామంలో హిందూ స్మశాన వాటిక స్థలం లో మెరుగైన వసతులు లేక స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారని ప్రభుత్వం మంజూరు చేసిన వైకుంఠధామాన్ని ఇతర ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల తీర్మానం లేకుండా సర్పంచ్ తుమ్మల జాన్ పాపయ్య ఇష్టానుసారంగా వ్యవహరించి నిర్మించారని స్థానిక వార్డు సభ్యులు ఆరోపించారు ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకుని గ్రామ పంచాయతీలో జరుగుతోన్న సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎం రమేష్ శ్రీకాంత్ నరేష్ కృష్ణవేణి గ్రామస్తులు ముత్తమాల జయరాజు పోతినేని మాలకొండయ్య రాంబాబు వెంకటేశ్వర్లు చంద్రశేఖర్ ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## 15 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు కోవిడ్ వ్యాక్సిన్ వేయించుకోవాలి



**బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ శ్వేత**

బెల్లంపల్లి ఫిబ్రవరి 14 ప్రజా పాలన ప్రతినిధి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో 15 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు వ్యాక్సిన్ చేయించుకుని ఆరోగ్యంగా ఉండాలని బెల్లంపల్లి మునిసిపల్ చైర్మన్ జక్కుల శ్వేత అన్నారు.సోమవారం నాడు నాలుగో వార్డు పరిధిలోని గోల్ బంగ్లా బస్తి ఏరియాలో వ్యాక్సిన్ చేస్తున్న సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తో పాటు మున్సిపల్ కమిషనర్ జంపాల రజిత, వార్డ్ కౌన్సిలర్ షేక్ ఆస్మా యూసుఫ్, ఆర్ పి సుజాత, ఏ ఎన్ ఎం లు, ఆశా వర్కర్లు, పలువురు తెరాస నాయకులు , వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ వెంకటేశ్వర్ల కి వినతి పత్రం అందజేశారు



ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి14 ప్రజాపాలన ప్రతినిధి :తట్టి అన్నారం గ్రామ సర్వే నెంబర్ 127/ 2,127/3 ప్రభుత్వ భూమినీ సర్వే చేసి కబ్జాదారుల నుంచి రక్షించాలనిసిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్మెట్ తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఈ నరసింహ మాట్లాడుతూ, గత సంవత్సర కాలం నుండి, ఇట్టి భూమి రక్షించాలని కలెక్టరు ఆర్ డి ఓ గారికి, విన్నవించి అనేక దఫాలుగా ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించినప్పటికీ. అధికారులు ప్రజా ప్రతినిధులు కబ్జాదారులతో కుమ్మక్కై కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతున్నప్పటికీ, ఎవరూ పట్టించుకోవడం లేదు, ఆ భూమిలో ఉన్న పట్టాదారులు, రెండు ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉందని చెబుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు మాత్రం, సర్వే చేయకుండా ప్రభుత్వ భూమిని బయటకు తీయకుండా కాలయాపన చేస్తున్నారు. కాబట్టి ఈ రోజు గ్రామ ప్రజలందరూ తక్షణమే సర్వే చేస్తామని చెప్పేంతవరకు ఇక్కడ నుండి కదిలేది లేదని ధర్నాకు కూర్చోవడంతో రెవెన్యూ అధికారులు వెంటనే సర్వే రాస్తున్నామని హామీ ఇవ్వడంతో ఎమ్మార్వో గారికి మెమోరాండం ఇచ్చి ధర్నా విరమించడం జరిగింది. వారం రోజుల్లో సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని తీయకపోతే తే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఉధృతమైన ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి అన్న ప్రభాకర్ ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి శివ కుమార్ . మునిందర్ రెడ్డి, సర్వయ్య, సుధాకర్, అరుణ్, మల్లయ్య, ప్రమీల, సువర్ణ పద్మ అనేక మంది పాల్గొన్నారు.

## మాటూరు హైస్కూలు విద్యార్థులకు బాల్య వివాహాలు, కౌమార వయసు సమస్యలపై అవగాహన కల్పించిన చైల్డ్ లైన్ అధికారిణి ధనలక్ష్మి అవగాహన



మధిర ఫిబ్రవరి 14 ప్రజాపాలన ప్రతినిధి : మధిర మండలంలోని సోమవారం నాడుమాటూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఖమ్మం చైల్డ్ లైన్ అధికారి శ్రీమతి %ఖ% ధనలక్ష్మి కౌమారదశలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ఎదురయ్యే సమస్యలు వాటి నివారణోపాయాలపై చక్కటి సూచనలు అందించారు. ముఖ్యంగా బాల్య వివాహాలు మీ భవిష్యత్తుకు అవరోధంగా నిలుస్తాయని పేర్కొంటూ అలాంటి సమస్యలు మీకు వచ్చినప్పుడు అధికారులుగా మా దృష్టికి తీసుకొని వచ్చినట్లయితే తప్పనిసరిగా మీకు అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా పాఠశాల వయసులో అందరూ పాఠశాలలోనే విద్య అభ్యసించాలని బడి మానేసి పనులు పోకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ దీవి సాయికృష్ణమాచార్యులు తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు సంక్రాతి శ్రీనివాసరావు, కొలగాని ప్రసాదరావు, మేడేపల్లి శ్రీనివాసరావు, కంచిపోగు ఆదాము, రెంటపల్లి భాగ్య శ్రీనివాసరావు,బానోత్ బావ్ సింగ్, వేము రాములు, పి లక్ష్మి , గుంటుపల్లి రమాదేవి, వేములపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటయ్య వీరయ్యను ఘనంగా సన్మానించిన టిఆర్ఎస్ నాయకులు



మధిర ఫిబ్రవరి 14 ప్రజా పాలనప్రతినిధిపట్టణ కమిటీ అధ్యక్షులు కనుమూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం నాడు ఒక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మధిర మండల పట్టణ టిఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు అనంతరం కోల్డ్ స్టోరేజ్ ప్రారంభోత్సవానికి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కు పూలమాలవేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించి న టిఆర్ఎస్ నాయకులు ఈ కార్యక్రమంలో లో జడ్పీ జె చైర్మన్ లింగాల గ్రామంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వరరావు పట్టణ ప్రచార కార్యదర్శి పల్లపోతు ప్రసాదరావు, పట్టణ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు రావూరి శ్రీనివాస రావు,మధిర సొసైటీ చైర్మన్ బి క్కికృష్ణ ప్రసాద్, బోయపాటి వెంకటేశ్వరరావు,యన్నం శెట్టి అప్పారావు, సయ్యద్ ఇక్బాల్, కొఠారి రాఘవరావు, మేడికొండ కిరణ్, ముత్తవరపు ప్యారీ తదితరులు.

## మధిర మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అస్సాం సీఎం పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



మధిర ఫిబ్రవరి 14 ప్రజాపాలన ప్రతినిధి మధిర మున్సిపాలిటీ మండల పట్టణ కాంగ్రెటస్ ఆధ్వర్యంలో సోమవారం నాడుకాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు లిరాహుల్ గాంధీలి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అస్సాం ముఖ్యమంత్రి హేమంత్ విశ్వ శర్మ పై టీపిసిసి అధ్యక్షుడు లిరేవంత్ రెడ్డిలి మధిర శాసనసభ్యులు సీఎల్పీ లీడర్ లిమల్లు భట్టి విక్రమార్కలి ఆదేశంతో ఈరోజు మధిర రూరల్ పోలీస్ స్టేషన్ లో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లిసూరంశెట్టి కిషోర్‌లి మధిర పట్టణ పోలీస్ స్టేషన్లో మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లిమిరియాల వెంకటరమణ గుప్తాలి ఫిర్యాదు చేశారుఈ కార్యక్రమంలో మధిర మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు లిదారా బాలరాజులి మధిర నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లితూమాటి నవీన్ రెడ్డిలి మధిర మున్సిపాలిటీ కౌన్సిలర్ లిమునుగోటి వెంకటేశ్వరరావులి మధిర మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లిఅద్దంకి రవి కుమార్‌లి మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు లిదుంపా వెంకటేశ్వర్ రెడ్డిలి ఐఎన్టియుసి మండల అధ్యక్షుల లికోరంపల్లి చంటి సొసైటీ డైరెక్టర్ లి లికనక పూడికరుణాకర్‌లి మధిర పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు లిషేక్ జహంగీర్‌లి ఐ ఎన్ టి యు సి పట్టణ అధ్యక్షుడు లిషేక్ బాజీలి మధిర పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు బిట్ర ఉద్.

## శ్రీ మృత్యుంజయ స్వామి వారి దేవస్థానం, దాతల సహకారంతో ప్రతి సోమవారంశివాలయం అన్నదానం వితరణ



.మధిర ఫిబ్రవరి 14 ప్రజాపాలన ప్రతినిధి మధిర మున్సిపాలిటీ పరిధిలో రెండో కాశీ గా పిలవబడుతున్న శివాలయం నందు ప్రతి సోమవారం అన్న దానం వితరణ లో భాగంగా దాతల సహకారంతో ఈ అన్నదాతలు నాళ్ళ శ్రీనివాసరావు ధర్మపత్ని సౌజన్య, పిల్లలు సాయి చరిత్, వాత్సల్య, మరియు వేముల నరేష్ కుమార్ ధర్మపత్ని అనూష పిల్లలు అభిష్న,వారి కుటుంబం తో అన్నదాన కార్యక్రమం జరిగిందని ఆలయ కమిటీ తెలిపింది ఈరోజు దాతలు ఈ సందర్భంగా మాట్లాడుతూ శివాలయంలో అన్నదాన కార్యక్రమం చేయటం ఈశ్వరుడు ఆశీస్సులు అందరికీ ఉండాలని పేదలకు అన్నదానం చేయడం అన్నం పరబ్రహ్మ స్వరూపం అని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వంకాయలపాటి నాగేశ్వరరావు గారు, ధర్మకర్తలు పబ్బతి రమేష్, పూజారులు రాయప్రోలు వెంకట సత్యనారాయణ శర్మ మరియు మల్లెల సాయి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మేడారం మొక్కులు టి ఎస్ ఆర్ టి సి కార్గో అండ్ పార్సిల్ సమ్మక్క సారలమ్మ బంగారం




మధిర ఫిబ్రవరి 14 ప్రజా పాలన ప్రతినిధి మధిర మున్సిపాలిటీ పరిధిలో టి ఎస్ ఆర్ టి సి పార్సెల్ వేడారానికి బంగారం పంపటంజరుగుతుందని టిఎస్ ఆర్టిసి కార్గో పార్సెల్ సర్వీస్ వారు తెలుపుతూ తో సోమవారంనాడు రామాలయం చైర్మన్ మధిర మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీ దొడ్డా మురళి బంగారం మొక్కు పంపించినారు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ మురళి మాట్లాడుతూ టీఎస్ ఆర్టీసీ కార్గో అండ్ పార్సిల్స్ ద్వారా ఇటువంటి అవకాశం కల్పించడం జాతరకు వెళ్లలేని భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని, మధిర పరిసర ప్రాంతభక్తులుఈసదావకాశం వినియోగించుకోవాలని, భక్తుల మొక్కులు తీర్చుకొనే అవకాశం కల్పించిన టి ఎస్ ఆర్ టి సి వారికి కూడా ఆ అమ్మవార్ల ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు.



# 'వలిమై' ప్రోమోకి వచ్చినవన్నీ పెయిడ్ లైకులేనా..?

కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ – టాలీవుడ్ యంగ్ హీరో కార్తికేయ కలిసి నటించిన లేటెస్ట్ మూవీ "వలిమై" రిలీజ్ కు రెడీ అయింది. హెచ్ వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ థ్రిల్లర్ ని ఫిబ్రవరి 24వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. తమిళంతో పాటుగా తెలుగు తమిళ మలయాళ కన్నడ హిందీ భాషల్లో ఈ సినిమా భారీ స్థాయిలో విడుదల కానుంది. ఇప్పటికే 'వలిమై' సినిమా నుంచి వచ్చిన స్పెషల్ పోస్టర్స్ – టీజర్ – ట్రైలర్ మరియు పాటలు విశేష స్పందన తెచ్చుకున్నాయి. మిలియన్ల కొలదీ వ్యూస్ తో అత్యధిక లైక్స్ తో సోషల్ మీడియాలో ట్రెండ్ క్రియేట్ చేసాయి. ఈ క్రమంలో ఇటీవల రిలీజ్ అయిన ఈ చిత్రానికి సంబంధించిన ప్రోమో ఒకటి నెట్టింట దుమారం రేపుతోంది. ఈ వీడియో లైక్స్ జెన్యూన్ గా వచ్చినవి కాదని కొందరు నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. యూట్యూబ్ లో మిలియన్ లైక్ ల మార్క్ ను దాటించడానికి మేకర్స్ కేవలం ఒక గంటలో 30 వేల వరకు లైక్ లను బూస్టప్ చేసారని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో యాంటీ ఫ్యాన్స్ చ%ఋశ్రీఅఋఋఖఅనూఅవంజుఇజూశీంవస% అనే హ్యాష్ ట్యాగ్ ను సోషల్ మీడియాలో ట్రెండ్ చేయడం ప్రారంభించారు. యూట్యూబ్ లో ఎక్కువ వ్యూస్ మరియు లైక్ లను పొందడానికి 'వాలిమై' మేకర్స్ పెయిడ్ వ్యూహాన్ని ఉపయోగిస్తోందని ట్వీట్లు పెడుతున్నారు. అయితే అజిత్ ఫ్యాన్స్ వీటిని తిప్పికొడుతున్నారు. తప్పుడు వార్తలను ప్రచారం చేయడం ద్వారా తమ హీరో ప్రతిష్టను దెబ్బతీసేందుకు యాంటీ ఫ్యాన్స్ ప్రయత్నిస్తున్నారని.. వాళ్ళ హీరోల రికార్డులు బ్రేక్ అవుతున్నాయనే ఆవేదనతో అలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఎదురుదాడి చేస్తున్నారు. వాస్తవానికి స్టార్ హీరోల సినిమాలకు సంబంధించి




ప్రమోషనల్ కంటెంట్ బయటకు వచ్చినప్పుడల్లా ఫ్యాన్స్ మధ్య పెయిడ్ లైక్స్ మీద వార్ జరుగుతూనే ఉంటుంది. ముఖ్యంగా టాలీవుడ్ – కోలీవుడ్ లలో ఇది కనిపిస్తుంది. తమ హీరో రికార్డ్స్ ని బ్రేక్ చేయడానికి ఇలాంటి వ్యూహంతో వస్తుంటారని ఒకరి మీద మరొకరు విమర్శలు చేసుకుంటూ ఉంటారు. అభిమానులు మరియు మేకర్స్ ఈ యూట్యూబ్ రికార్డ్స్ క్రేజ్ నుండి ఎప్పుడు బయటపడతారో మరి.

# బాలయ్య టాక్ షో గురించి తమిళ స్టార్ కంపోజర్ కామెంట్స్



తమిళ సినీ ఇండస్ట్రీలో ఏఆర్ రహమాన్ తర్వాత ఆ స్థాయి సంగీత దర్శకుడిగా పేరు దక్కించుకున్న అనిరుద్ తాజాగా తమిళ ఆహా ఓటీటీ ప్రారంభోత్సవంలో పాల్గొన్నాడు. ఆహా తమిళ ప్రారంభోత్సవం సందర్భంగా పలువురు పలు రకాలుగా మాట్లాడుతూ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ప్రతి ఒక్కరు కూడా తెలుగు లో ఎలా అయితే సూపర్ హిట్ ఓటీటీ గా ఆహా నిలిచిందో అలాగే తమిళ ఆహా కూడా నిలవాలంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అనిరుధ్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తమిళ ఓటీటీ ప్రారంభోత్సవం సందర్భంగా అనిరుధ్ మాట్లాడుతూ తెలుగు ఆహా ఓటీటీ కి సంబంధించిన షో లు నేను కొన్ని చూశాను. ముఖ్యంగా ఆహా లో స్ట్రీమింగ్ అవుతున్న ఎన్బీకే అన్ స్టాపబుల్ టాక్ షో కు సంబంధించిన ప్రోమోలను యూట్యూబ్ లో చూడటం జరిగింది. అవి చాలా బాగున్నాయి. ఆ షో మంచి హిట్ గా నిలిచింది. అలాగే తమిళంలో కూడా ఆహా ఓటీటీ పెద్ద హిట్ అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అంటూ అనిరుధ్ ఆల్ ది బెస్ట్ చెప్పాడు. తెలుగు ప్రేక్షకులకు మాత్రమే కాకుండా మన బాలయ్య టాక్ షో తమిళ ప్రేక్షకులు మరియు సెలబ్రెటీల వరకు చేరింది అంటే ఏ స్థాయిలో ఈ షో సక్సెస్ అయ్యిందో అర్థం చేసుకోవచ్చు అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. పెద్ద ఎత్తున ఈ టాక్ షో కు వచ్చిన రెస్పాన్స్ నేపథ్యంలో త్వరలోనే సీజన్ 2 ను తీసుకు వస్తామంటూ ఇప్పటికే ఆహా ప్రకటించిన విషయం తెల్సిందే. తెలుగు లో ఆహా ఓటీటీ లో అత్యధిక రన్ టైమ్ వ్యూస్ ను దక్కించుకున్న షో గా బాలయ్య టాక్ షో అన్ స్టాపబుల్ నిలిచింది. అద్భుతమైన కంటెంట్ ను ఆహా ద్వారా తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్న వారు ఇప్పుడు తమిళ ఓటీటీ మొదలు పెట్టడం ద్వారా మరింత ఎంటర్ టైన్మెంట్ ను అందించేందుకు సిద్ధం అవుతున్నారు. అక్కడ కూడా తెలుగు టీమ్ తరహాలోనే ఒక మంచి టీమ్ ను అల్లు అరవింద్ ఫామ్ చేశాడు. వారు తక్కువ బడ్జెట్ తో క్వాలిటీ మరియు బెస్ట్ కంటెంట్ ను అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. చిన్న సినిమాలు.. వెబ్ సిరీస్లు మాత్రమే కాకుండా అక్కడ కూడా టాక్ షో లు ఇతర షో లతో తమిళ ప్రేక్షకులను ఎంటర్ టైన్ చేయబోతున్నారు. బాలయ్య టాక్ షో తరహా లో అక్కడ కూడా స్టార్ హీరోతో ఒక టాక్ షో ను ప్లాన్ చేస్తే ఖచ్చితంగా మంచి విజయాన్ని సొంతం చేసుకునే అవకాశాలు ఉన్నాయి. ఆహా కేవలం తమిళంలోనే కాకుండా ఇతర భాషల్లో కూడా విస్తరించే అవకాశం ఉంది. వేరు వేరు భాషలకు వేరు వేరు ప్లాట్ ఫామ్స్ ఉండటం వల్ల ఎక్కువ శాతం ప్రేక్షకులు ఖాతాదారులుగా అయ్యే అవకాశాలు ఉన్నాయంటూ మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆహా ముందు ముందు మరింతగా ఎంటర్ టైన్మెంట్ ను అందించేలా ప్లాన్స్ చేస్తున్నట్లుగా అల్లు అరవింద్ తాజాగా ప్రకటించాడు.

# రీల్ విలన్ కు ప్రపోజల్స్ అలా వస్తుంటాయట


టాలీవుడ్ లో టాప్ విలన్ గా.. క్యారెక్టర్ ఆర్టిస్టుగా.. పోలీసు అధికారిగా ఇట్టే సూట్ అయ్యే నటుల్లో ఒకరు సంపత్ రాజ్. గంభీరమైన స్వరం.. అంతకు మించి తెర మీద నిండుగా కనిపించే రూపంతో చాలా తక్కువ వ్యవధిలోనే తెలుగు ప్రేక్షకులకు ఇట్టే కనెక్టు అయిన నటుడు ఆయన. ఆయనకు సంబంధించిన వ్యక్తిగత విషయాలు అప్పుడప్పుడు వార్తల్లో వస్తుంటాయి. ఆయన విడాకులు తీసుకోవటం.. ఒక నటితో సహజీవనం చేసినట్లుగా వార్తలు రావటం.. అసలు అదంతా పచ్చి అబద్ధమని.. తనను ఎప్పుడు అలా చూడలేదని గతంలో వెల్లడించిన ఆయన తాజాగా ఒక ప్రముఖ చానల్ లో ఇంటర్వ్యూ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన తనకు సంబంధించిన వ్యక్తిగత విషయాలతో పాటు.. విడాకులు తీసుకున్న తనకు ఇండస్ట్రీకి చెందిన వారి నుంచి వచ్చే ప్రపోజల్స్ తో పాటు.. తాను వాటికి ఎలా రియాక్టు అవుతానన్న విషయాల్ని వెల్లడించారు. ప్రస్తుతం లేట్ ఫార్టీస్ లో ఉన్న ఆయన తాను ఒంటరిగా ఉంటానని చెబుతూ.. పలు ఆసక్తికర అంశాల్ని వెల్లడించారు. ఇంతకూ రీల్ మీద విలనిజంతో చెలరేగిపోయే సంపత్ కు ఆ తరహా ప్రపోజల్స్ ఎలా వస్తాయన్నది ఆయన మాటల్లోనే చూస్తే..'మీరు డైవర్సీ అని తెలిసింది. మనం ఎక్కడైనా కలుద్దామా? అని



చాలామంది అడుగుతుంటారు. కానీ.. నేను అలాంటివి ప్రోత్సహించలేదు. ఎందుకంటే నా దృష్టంతా నా కూతురుపైనే. ఒకవేళ నేను అలా వెళ్లిపోతే నా కూతుర్ని పెంచి పెద్దచేయాలని నేను తీసుకున్న నిర్ణయానికి అర్థం ఉండదు. ఇండస్ట్రీ బయట నుంచి కూడా ప్రపోజల్స్ వచ్చాయి. నేను పట్టించుకోలేదు. నాకు 45 ఏళ్లప్పుడు ఒక రిలేషన్షిప్ ట్రై చేశాం. కానీ ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఆ విషయం నా కూతురుకు కూడా తెలుసు' అని వెల్లడించారు. జీవితంలో ఎప్పుడు ఏది జరగాలని ఉంటే అదే జరుగుతుందని.. ఎందుకలా జరుగుతుందని తాను ప్రశ్నించుకోలేదన్న సంపత్.. సినిమా రంగంలోకి వచ్చి తనకు ఇప్పటికి 20 ఏళు అయ్యిందని.. తన ప్రైమ్ ఏజ్ లో ఒంటరిగానే ఉన్నానని.. ఆ ఒంటరితనం అలవాటైందన్నారు. "ఈ స్పేస్ను ఇంకొకరితో షేర్ చేసుకోవాలంటే... అది ఎలా ఉంటుందో తెలియదు నాకు. సో... మళ్లీ పెళ్లి చేసుకొంటే బాగుంటుందా? బాగుండదా? అని నాలో భయం (నవ్వు). ప్రస్తుతానికి హాయిగా ఉన్నాను కదా! అది చాలు! మా అమ్మాయి చెబుతుంటుంది... 'నాన్నా... ట్రై చేయండి' అని. 'దానంతట అదే వస్తే చూద్దాం" అని అంటానని సంపత్ చెప్పారు.

# అనసూయ సెల్ఫ్ గోల్ చేసుకుంటోందా?

బుల్లితెరతో కామెడీ షో ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుంది అనసూయ. అదే క్రేజ్ తో వెండితెరపై కూడా తనదైన స్టైల్లో ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేస్తోంది. బుల్లితెరని వీడకుండానే అక్కడ వరుస షాలల్లో పాల్గొంటూనే సినిమాల్లోనూ నటిస్తూ ఆశ్చర్యపరుస్తోంది. గతంతో పోలిస్తే వరుస క్రేజీ ఆఫర్లని సొంతం చేసుకుంటూ వెండితెరపై యమ బిజీగా మారిపోయింది. రంగస్థలం వంటి బ్లాక్ బస్టర్ మూవీలో రంగమ్మత్తగా ఆకట్టుకుని విమర్శలకు ప్రశంసలు సొంతం చేసుకుంది. ఇదే ఉత్సాహంతో ఇటీవల ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తో సుకుమార్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కించిన పుష్ప ది రైజ్లో దాక్షాయణిగా కనిపించింది. దీనికి సంబంధించిన పార్ట్ 2 త్వరలో ప్రారంభం కాబోతోంది. అందులో అనసూయ పాత్ర మరింత హైలైట్గా క్రుయల్ గా వుంటుందని ఇన్ సైడ్ టాక్ .ఈ పాత్రతో అనసూయకు సరికొత్త ఇమేజ్ రావడం గ్యారెంటీ అని చెబుతున్నారు. ఇదిలా వుంటే అనసూయ సెల్ఫ్ గోల్ చేసుకుంటోందని ఇండస్ట్రీలో ప్రచారం మొదలైంది. అందుకు ప్రధాన కారణం మాస్ మహారాజా రవితేజ నటించిన ఖిలాడీ చిత్రం అని చెబుతున్నారు. ఇందులోని ఫస్ట్ పార్ట్లో అనసూయ హీరోయిన్ డింపుల్ హయాతీకి తల్లిగా కనిపించింది. ఓల్డ్ స్కూల్ మదర్ గా అనసూయ కనిపించిన తీరు ప్రేక్షకుల్ని అసహనానికి గురిచేసిందట. సెకండ్ పార్ట్ లో ఇంటర్వెల్ తరువాత



సడన్ గా మోడ్రన్ యువతిగా చూపించిన తీరు ఆడియన్స్ తో పాటు ఆమె అభిమానుల్ని షాక్ కు గురిచేసింది. అంతే కాకుండా ఓవర్ డోస్ మేకప్ షార్ట్స్ లో కనిపించిన తీరు చాలా మందికి అసభ్యకరంగా.. చాలా వోవర్ గా అనిపించిందని చెబుతున్నారు. ప్రస్తుతం ఖిలాడీలో అనసూయ పోషించిన పాత్ర ఆమె కాస్ట్యూమ్స్ మేకప్ వేసుకున్న దీరు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఇక మరో విషయం ఏంటంటే సెకండ్ హాఫ్ లో అనసూయకు చెప్పుకోదగ్గ స్కోప్ లేదు. దీంతో ప్రాధాన్యత లేని పాత్రలో అనసూయ కనిపించాల్సి వచ్చింది. అయితే రంగస్థలం పుష్ప లాంటి చిత్రాల్లో ప్రాధాన్యత వున్న పాత్రల్లో నటించిన అనసూయ ఇలాంటి పాత్రలని అంగీకరించడం ఏంటీ? అని కొంత మంది.. సెల్ఫ్ గోల్ చేసుకుంటోందా? అని మరి కొంత మంది..ఆమెకు జడ్జిమెంట్ లేదని మరి కొంత మంది కామెంట్ చేస్తున్నారు. అయితే అనసూయ ఖిలాడీ చిత్రంలో సిల్లీ రోల్ చేయడానికి ప్రధాన కారణం డబ్బు అని ఆ కారణంగానే ఆమె ఆ పాత్రని అంగీకరించాల్సి వచ్చిందని స్పష్టమవుతోంది. డబ్బు కోసమే ఇలాంటి పాత్రల్లో నటించడం వల్ల కెరీర్ పరంగా సెల్ఫ్ గోల్ చేసుకోవడం అవుతుంది కదా అని ఇండస్ట్రీ వర్గాలు వాపోతున్నాయి.

# నైజాంలో "ఖిలాడి" 3 రోజుల వసూళ్ల వివరాలు.!

మాస్ మహారాజ్ రవితేజ హీరోగా డింపుల్ హయాతి మరియు మీనాక్షి చౌదరి లు హీరోయిన్స్ గా నటించిన లేటెస్ట్ చిత్రం "ఖిలాడి". రవితేజ కెరీర్ లో మాస్ హిట్ "క్రాక్" తర్వాత వచ్చిన ఈ చిత్రం మంచి స్టైలిష్ ఎంటర్టైనర్ గా రిలీజ్ అయ్యి డీసెంట్ ఓపెనింగ్స్ అందుకుంది. దర్శకుడు రమేష్ వర్మ తెరకెక్కించిన ఈ చిత్రం మొదటి రోజు మంచి ఓపెనింగ్స్ నే అన్ని ఏరియాల్లో అందుకుంది అయితే ఇప్పుడు నైజాం లో ఈ చిత్రం వసూళ్లకు సంబంధించి వివరాలు తెలుస్తున్నాయి. ఈ చిత్రం ఈ మూడు రోజుల్లో కలిపి నైజాం 2.4 కోట్ల రూపాయల షేర్ ని రాబట్టిందట. అయితే ఇది ఈ సినిమా టార్గెట్ కి కాస్త తక్కువ నెంబర్ అనే చెప్పాలి. ఇక ఇప్పుడు వీక్ స్టార్ట్ లో పరిస్థితి మరింత తగ్గొచ్చు.. ప్రస్తుతానికి అయితే మౌత్ టాక్ ఓ మాదిరి గానే ఉన్నా సినిమా వసూళ్లు ఎక్కడ ఆగుతాయో చూడాలి. ఇక ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందివ్వగా పెన్ మూవీస్ మరియు ఏ స్టూడియోస్ వారు నిర్మాణం వహించారు.






Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989